E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 18-09-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




చాలా రాష్ట్రాల్లో సగం మందికిపైగా ఓటర్లు ఎస్ఐఆర్‌కు పత్రాలు ఇవ్వనవసరం లేదు » 2లో

మధ్యతరగతికి ఉపశమనం కల్పించేలా జీఎస్టీ సంస్కరణలు: నిర్మలా సీతారామన్ » 4లో



మంధన విధ్వంసకర శతకం.. » 6లో



నేనూ తొలి రోజుల్లో అంతే » 5లో



## రజాకార్ల దారుణాలు పహల్గాం దాడి లాంటివే



- ఎవరో చెబితే ఆగలేదు.. ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదు
- కేంద్ర రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టీకరణ
- ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

ఈకబురు,హైదరాబాద్‌హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్ ఎవరో మూడో వ్యక్తి ప్రమేయంతో ఆగిపోలేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేశారు. "ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదు. విరామం మాత్రమే ఇచ్చాం. మరోసారి ఉగ్రదాడి జరిగితే తిరిగి ప్రారంభమవుతుందని గుర్తుంచుకోవాలి. నాడు తెలంగాణలో రజాకార్లు చేసిన దారుణాలు... ఇటీవల జరిగిన పహల్గాం దాడి లాంటివే. రెండుచోట్లా మతం అడిగే చంపారు. రజాకార్లు కేవలం

తరువాయి 2లో

## మరింత ఉత్సాహంతో పనిచేస్తా.. 'జనశక్తి'కి కృతజ్ఞతలు: ప్రధాని మోదీ

ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా దేశవిదేశాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే ధన్యవాదాలు తెలుపుతూ మోదీ ట్వీట్ చేశారు. 'జనశక్తికి కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. 'వికసిత్ భారత్' కలను సాకారం చేసే దిశగా మరింత ఉత్సాహం, అంకితభావంతో పనిచేయాలని సంకల్పించినట్లు తెలిపారు. తన పుట్టిన రోజు నేపథ్యంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో నిమగ్నమైనవారిని అభినందించారు.

తరువాయి 2లో



## సరికొత్త విద్యా విధానాన్ని తీసుకొద్దాం



- ఈ విధానం వచ్చే 25 ఏళ్ల వరకు దిశా నిర్దేశం చేసేలా ఉండాలి
- తెలంగాణ విద్యా విధానం ఖరారు కమిటీ సమావేశంలో సీఎం రేవంత్
- భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో బోధన సాగాలి
- ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించాలి
- నిరుపేదలకు మేలు జరగాలి.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలి
- మేధావులు, విద్యావేత్తలు ఈ మేరకు సలహాలివ్వాలన్న ముఖ్యమంత్రి
- మౌలిక వసతులపై ఖర్చుకు ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడి

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్ర విద్యా విధానంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని అన్నారు. సరికొత్త తెలంగాణ విద్యా విధానం తీసుకురావాలన్నది ప్రభుత్వ ఆలోచన అని వెల్లడించారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారిలో జ్ఞానం కొరవడిందని, జ్ఞానం ఉన్న వారికి భాషలో పట్టు లేదని అన్నారు. ఈ రెండూ ఉన్న వారిలో నైపుణ్యం ఉండటం లేదని చెప్పారు. దేశ, విదేశాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నప్పటికీ, ఆ స్థాయిలో విద్యా ప్రమాణాలు మెరుగవ్వడం లేదని చెప్పారు. ఈ కారణంగా ఉద్యోగాలను సొంతం చేసుకోవడంలో యువత వెనుకబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో విద్యా బోధన సాగాలని, వచ్చే 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశా నిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని ఆకాంక్షించారు. డిసెంబర్ 9వ తేదీన ఆవిష్కరించనున్న 'తెలంగాణ రైజింగ్–2047'లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నేతృత్వంలో రాష్ట్ర విద్యా విధానం ఖరారుకు ఏర్పాటు చేసిన కమిటీతో బుధవారం సీఎం భేటీ అయ్యారు. విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో తన అభిప్రాయాలు వెల్లడించారు.

తరువాయి 2లో

## యువతతో పెట్టుకుంటే పతనమే : కేటీఆర్

» 2లో



## మావోయిస్టు లేఖల కలకలం

- ఆయుధాలు వదిలేందుకు సిద్ధమయ్యారా?
- ఏది అసలు..? ఏది నకిలీ..?
- ప్రజాసంఘాలు, మాజీ మావోయిస్టుల భిన్నాభిప్రాయాలు
- అదంతా మైండ్‌గేమ్ అంటున్న పోలీసులు
- చీలిక దిశగా మావోయిస్టు పార్టీ?



ఈకబురు,హైదరాబాద్: ప్రాణంతో సమానంగా చూసుకుంటున్న ఆయుధాలను వదిలేస్తామని మావోయిస్టులు నిజంగానే నిర్ణయించారా? ఆయుధాలను వదిలేస్తామంటూ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విడుదలైన లేఖ నిజమైనదేనా? మావోయిస్టులు లేఖల పేరిట మైండ్‌గేమ్ ఆడుతున్నారా? అంటే.. భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అభయ్ పేరిట విడుదలైన లేఖ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టు పార్టీ పంథాకు పూర్తి విరుద్ధమైన అంశాలు లేఖలో ఉండడం, లేఖపై అభయ్ ఫొటో ముద్రించి ఉండడం, ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడం కోసమంటూ ఈమెయిల్, ఫేస్‌బుక్ ఐడీలు ఇవ్వడం చూస్తుంటే అది పక్కాగా నకిలీ లేఖేనని ప్రజా సంఘాల నేతలు, మాజీ మావోయిస్టులు పేర్కొంటున్నారు. ఒకవేళ ఈలేఖ నిజమైనదే అయితే మాత్రం మావోయిస్టు పార్టీ చీలిక దిశగా పయనిస్తోందన్న అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి మావోయిస్టు పార్టీ కేంద్ర అధికార ప్రతినిధి ఇటీవల ఓ లేఖ విడుదల చేశారు. అందులో ఆపరేషన్ కగార్‌ను ప్రస్తావిస్తూ.

తరువాయి 3లో

## ఆర్టీసీలో 1,743 ఉద్యోగాల భర్తీ

- 13 ఏళ్ల తర్వాత నియామకాలు
- తెలంగాణ వచ్చాక ఆర్టీసీలో తొలి నియామకాలు
- వేయి మంది డ్రైవర్లు, 743 మంది శ్రామిక్ పోస్టుల భర్తీకి ఏర్పాట్లు
- నోటిఫికేషన్ జారీ చేసిన రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు
- తెలంగాణ వచ్చాక ఆర్టీసీలో తొలి నియామకాలు

ఈకబురు, హైదరాబాద్: ఆర్టీసీలో 13 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఉద్యోగ నియామకాలు జరగబోతున్నాయి. వేయి మంది డ్రైవర్లు, 743 మంది శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఆర్టీసీలో జరగబోతున్న తొలి నియామక ప్రక్రియ ఇదే కావటం విశేషం. చివరిసారిగా 2012లో డ్రైవర్, కండక్టర్లను నియమించారు. ఆ తర్వాత మళ్లీ నియామకాలు జరగలేదు.

ఉద్యోగ విరమణలతో భారీగా ఖాళీలు ఏర్పడినప్పటికీ, ఉన్న సిబ్బందితోనే ఆర్టీసీ నెట్టుకొస్తోంది. 2019లో ఒకేసారి ఏకంగా 2 వేల బస్సులను రద్దు చేయటం, పాత బస్సులను తుక్కుగా మార్చినప్పటికీ.. వాటి స్థానంలో చాలినన్ని కొత్త బస్సులు కొనకపోవటం తదితరాల వల్ల సమస్య తీవ్రత మరింత పెరగకుండా చూస్తూ వచ్చారు.




తరువాయి 2లో

## హైదరాబాద్‌లో దంచికొడుతున్న వాన.. చెరువులను తలపిస్తున్న రోడ్లు



ఈకబురు,హైదరాబాద్: నగరంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం నుంచి భారీ వర్షం కురుస్తూనే ఉంది. ముషీరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది. దీంతో పలు కాలనీల్లో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట్, సనత్‌నగర్, కృష్ణానగర్, మియాపూర్, చందనాగర్, మాదాపూర్, రాయదుర్గం, కేపీహెచ్‌బీ, సుచిత్ర, గండి మైసమ్మ, దుండిగల్ కాప్రా, ఏఎస్‌రావు నగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. యూసుఫ్‌గూడా కృష్ణానగర్ బి బ్లాక్‌లో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో వాహనదారులు, వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మాదాపూర్‌హైటెక్ సిటీ చౌరస్తా వద్ద భారీ వర్షంతో ట్రాఫిక్ జామ్ అయింది. రాయదుర్గం, అమీర్‌పేట, బంజారాహిల్స్ ఐకియా మార్గంలో తదితర ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. మియాపూర్ చందానగర్ నగర్ మార్గంలో రహదారిపై మోకాలిలోతు నీరు నిలిచిపోయింది. దీంతో ముంబయి జాతీయ రహదారిపై 3 కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి.

తరువాయి 2లో

## ఇది పొంతన లేని తీర్పు



తరువాయి 3లో

మొదటి పేజీ తరువాయి

# రజాకార్ల దారుణాలు పహల్గాం దాడి లాంటివే



ఈకబురు,హైదరాబాద్‌హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్ ఎవరో మూడో వ్యక్తి ప్రమేయంతో ఆగిపోలేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేశారు. "ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదు. విరామం మాత్రమే ఇచ్చాం. మరోసారి ఉగ్రదాడి జరిగితే తిరిగి ప్రారంభమవుతుందని గుర్తుంచుకోవాలి. నాడు తెలంగాణలో రజాకార్లు చేసిన దారుణాలు... ఇటీవల జరిగిన పహల్గాం దాడి లాంటివే. రెండుచోట్లా మతం అడిగే చంపారు. రజాకార్లు కేవలం హిందువులపై కాకుండా భారత్‌ను సమర్థించేవారిపైనా దాడులు చేశారు. రజాకార్ల మనస్తత్వాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు" అని హెచ్చరించారు. బుధవారం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో కేంద్ర సాంస్కృతిక శాఖ నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమరవీరులకు, సర్దార్ పటేల్‌కు నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేసి పారామిలటరీ దళాల గౌరవ వందనం స్వీకరించారు. సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్ సమీపంలోని కంటోన్మెంట్ పార్కులో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ... "ఉగ్రవాదంపై మనం తీసుకునే చర్యలు, వ్యవహరించే తీరు మన దేశ సార్వభౌమాధికారానికి సంబంధించినవి. పాకిస్థాన్ డిప్యూటీ ప్రధాని, ఆ దేశ విదేశాంగ మంత్రి సైతం మూడో వ్యక్తుల మధ్యవర్తిత్వాన్ని భారత్ తిరస్కరించినట్లు వెల్లడించిన విషయాన్ని గుర్తుచేస్తున్నా. ప్రధాని మోదీ నాయకత్వంలో 2016లో సర్జికల్ స్ట్రైక్స్, 2019లో బాలాకోట్ వైమానిక దాడులు, ఈ ఏడాది ఆపరేషన్ సిందూర్ జరిగాయి. మనదేశంలో శాంతికి భంగం కలిగించేవారిపై మనం వ్యవహరించే తీరుకు ఈ ఘటనలే నిదర్శనం" అని వివరించారు.

ఆపరేషన్ పోలోలో మా బంధువులు: షెకావత్

కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ... "ఆపరేషన్ పోలోలో పాల్గొన్న సైన్యంలో మా సమీప బంధువులు ఉండటం గర్వంగా ఉంది. వారు జోధ్‌పూర్ సెకండ్ లాన్సర్‌లో ఇప్పటికీ కీలక హోదాల్లో ఉన్నారు" అని వెల్లడించారు.

అధికారంలోకి వచ్చి సాధికారికంగా నిర్వహిస్తాం: కిషన్‌రెడ్డి

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... "తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించకుండా భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఈ తరానికి గొప్ప చరిత్ర తెలియకుండా తొక్కిపెట్టా□. కర్ణాటక, మహారాష్ట్రలలో అధికారికంగా చేపడుతుండగా ఇక్కడేమో ఒక వర్గం ఓట్ల కోసం, ఎంఐఎంకు భయపడే నిర్వహించలేదు. మూడేళ్ల తర్వాత రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తుంది. అప్పుడు హైదరాబాద్ విముక్తి ఉత్సవాలను ప్రతి గ్రామంలో అధికారికంగా నిర్వహిస్తాం" అని స్పష్టంచేశారు.

రాజ్‌నాథ్‌సింగ్ కృషిని మరువలేం: బండి సంజయ్

"రజాకార్లు జలియన్ వాలాబాగ్‌ను మించి పరకాల, బైరాన్‌పల్లి, గుండ్రాంపల్లిలో రక్తపాతం సృష్టించారు. పటేల్ లేకుంటే తెలంగాణకు విముక్తి లభించేది కాదు. తెలంగాణ విభజన సమయంలో రాజ్‌నాథ్‌సింగ్ కృషి మరువలేనిది" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పాల్గొన్నారు.

# యువతతో పెట్టుకుంటే పతనమే: కేటీఆర్



ఈకబురు,హైదరాబాద్: యువతతో పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పతనం కావడం ఖాయమని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. గ్రూప్1 పరీక్షల్లో అవకతవకలను, విద్యార్థులకు జరిగిన నష్టాన్ని హైకోర్టు గుర్తించిందని.. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గతంలో పేపర్ లీక్ అంటూ సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన భాజపా.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉంటోందని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ పలు అంశాలపై మాట్లాడారు. "రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవలు బంద్ కావడంతో వైద్య సేవలు స్తంభించాయి. ఆశా వర్కర్లు, రేషన్ డీలర్ల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ వేధింపుల వల్లే మెట్రో ప్రాజెక్టు నుంచి ఎల్ అండ్ టీ తప్పుకొంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో బంధుప్రీతి లేదని ముఖ్యమంత్రి చెబుతున్నారు.. మరి సీఎం బంధువులకు రూ.వందల కోట్ల కాంట్రాక్టులు కొత్తగా ఎలా ఇచ్చారు? ప్రజాస్వామ్యంలో ఎవరికైనా పార్టీ పెట్టే హక్కు ఉంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలను చూస్తే జాలేస్తోంది. భారత రాష్ట్ర సమితి గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి.. కాంగ్రెస్ బీఫాంపై ఎంపీగా పోటీ చేసిన దానం నాగేందర్ స్పీకర్‌ను ఇంకా ఎందుకు కలుస్తున్నారు? ప్రజల అసంతృప్తి ఎలా ఉంటుందో.. రాబోయే స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికలతోపాటు.. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ చూస్తుంది" అని కేటీఆర్ పేర్కొన్నారు.

మేడిగడ్డలో ఒక్క రూపాయీ వృథా కాలేదు

మేడిగడ్డ నిర్మాణంలో ఒక్క రూపాయి ప్రజాధనం కూడా వృథా కాలేదని కేటీఆర్ చెప్పారు. భారత రాష్ట్ర సమితి నాయకుడు రాకేశ్‌రెడ్డి రూపొందించిన 'కాళేశ్వరం' డాక్యుమెంటరీని తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. కేటీఆర్ మాట్లాడుతూ.. "కే అంటే కాలువలు.. సీ అంటే చెరువులు.. ఆర్ అంటే రిజర్వాయర్లుగానే కేసీఆర్‌ని తెలంగాణలోని ప్రతి బిడ్డ గుర్తు పెట్టుకుంటుంది. బ్యారేజీ నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థనే తన డబ్బులతో పునర్ నిర్మిస్తామంటోంది. ఇక ఇందులో ప్రజాధనం ఎక్కడ వృథా అయ్యింది? తెలంగాణ తలరాత మార్చిన కేసీఆర్ పనితనాన్ని ప్రపంచం ముందు ఘనంగా చెప్పుకోవడంలో పార్టీగా విఫలమయ్యాం. ఈ డాక్యుమెంటరీని తెలంగాణలోని ప్రతి గడపకూ తీసుకుపోదాం" అని కేటీఆర్ తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## మరింత ఉత్సాహంతో పనిచేస్తా.. 'జనశక్తి'కి కృతజ్ఞతలు: ప్రధాని మోదీ



ఈ-కబురు, "దేశవిదేశాల నుంచి అందిన శుభాకాంక్షలు, ఆశీర్వాదాలు, ఆప్యాయతతో కూడిన సందేశాలతో ఉప్పొంగిపోయాను. ఈ అనురాగం ఎంతో ప్రేరణగా నిలుస్తోంది. కేవలం నా ఒక్కడికే కాకుండా.. మెరుగైన భారత నిర్మాణం కోసం మనమంతా కలిసి చేస్తున్న పనులకు దీవెనగా భావిస్తున్నాను. మరోవైపు.. దేశవ్యాప్తంగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేశవాసుల్లో అంతర్లీనంగా ఉన్న ఈ మంచితనమే సమాజాన్ని నిలబెడుతోంది. సానుకూల దృక్పథం, ఆశావాదంతో అన్ని సవాళ్లను అధిగమించేందుకు ధైర్యాన్ని అందిస్తోంది. 'వికసిత్ భారత్' కలను సాకారం చేసేందుకు మరింత శక్తి, అంకితభావంతో పనిచేయాలని నిశ్చయించుకున్నాను. అందరికి మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నాను" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

నమో నమో ఆర్త బాంధవుడా.. మోదీ బర్త్‌డే స్పెషల్ సాంగ్

జన్మదినం పురస్కరించుకుని ప్రధాని మోదీకి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత పుతిన్ సహా వివిధ దేశాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, కేంద్ర మంత్రులు, సినీ నటులు, వివిధ రంగాల ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు పెట్టారు. ఆయా రాష్ట్రాల్లో పెద్దఎత్తున సేవా కార్యక్రమాల నిర్వహణతోపాటు వివిధ పథకాలకు శ్రీకారం చుట్టారు.

మొదటి పేజీ తరువాయి

# సరికొత్త విద్యా విధానాన్ని తీసుకొద్దాం



భాష, జ్ఞానం, నైపుణ్యాలు, క్రీడల మేళవింపుతో విద్యా బోధన సాగాలని, వచ్చే 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశా నిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని ఆకాంక్షించారు. డిసెంబర్ 9వ తేదీన ఆవిష్కరించనున్న 'తెలంగాణ రైజింగ్-2047'లో తెలంగాణ విద్యా విధానానికి చోటు కల్పిస్తామని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు నేతృత్వంలో రాష్ట్ర విద్యా విధానం ఖరారుకు ఏర్పాటు చేసిన కమిటీతో బుధవారం సీఎం భేటీ అయ్యారు. విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో తన అభిప్రాయాలు వెల్లడించారు.

అన్ని స్థాయిల్లో ప్రక్షాళన

'విద్యా రంగం అభివృద్ధికి ఇప్పటివరకు జరిగిన కృషిపై ఏమాత్రం సంతృప్తి లేదు. ఈ రంగానికి భారీఎత్తున నిధులు కేటాయిస్తున్నా ప్రభుత్వ స్కూళ్ళల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయి. ప్రైవేటు పాఠశాలలు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీతో ప్రారంభిస్తుంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రారంభమవుతున్నాయి. నర్సరీకి ప్రైవేటు పాఠశాలల్లో చేరిన వారు తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు చూడటం లేదు.

విద్యార్థుల రాకపోకలకు వీలుగా ఉంటుందని, తగిన శ్రద్ధ చూపుతారనే కారణంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. ప్రాథమిక విద్య నుంచి విశ్వవిద్యాలయాల స్థాయి వరకూ ప్రక్షాళన అవసరం. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించాల్సిన అవసరం ఉంది. తెలంగాణ విద్యా విధానం రూపకల్పనలో ఈ అంశానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి..' అని ముఖ్యమంత్రి సూచించారు.

అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలి

'ప్రాథమిక, ఉన్నత, సాంకేతిక, నైపుణ్య విద్యలుగా విభజించుకోవాలి. విద్యావేత్తలు తమ అభిరుచులకు అనుగుణంగా సబ్ కమిటీలుగా ఏర్పడి అత్యుత్తమ డాక్యుమెంట్ రూపొందించాలి. రాష్ట్రంలోని నిరుపేదలకు మేలు జరిగేలా కొత్త విద్యా విధానం ఉండేందుకు మేధావులు సలహాలివ్వాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల పేరిట విద్యార్థులను చిన్నతనం నుంచే వేరు చేస్తున్నాం. దానిని రూపుమాపి అంతా ఒకటే అనే భావన కలిగించాలి. విద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు ఉండాలి. ఆశించిన స్థాయిలో తెలంగాణ విద్యా విధానం అమలయ్యేందుకు వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం తీసుకోవాలి..' అని సీఎం చెప్పారు.

నిధులు ఎంతైనా వెనుకాడం

'ప్రభుత్వం కూడా ఈ దిశగా కృషి చేస్తోంది. విద్యార్థుల సంఖ్యకు సరిపడా టీచర్లు ఉండాలన్న లక్ష్యంతోనే ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాం. బదిలీలు, పదోన్నతులు కల్పించాం. యూనివర్సిటీలకు వీసీలను నియమించాం. దేశంలో ఐటీఐలు ప్రారంభించినప్పుడు ఉన్న డీజిల్ ఇంజిన్ మెకానిక్, ఫిట్టర్ వంటి సంప్రదాయ కోర్సులే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. మేము అధికారంలోకి వచ్చాక ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సులను తెచ్చాం.

సరికొత్త విద్యా విధానం ఏర్పాటుకు ఎంత నిధులైనా వెనుకాడబోం. ప్రత్యేక విద్యా కార్పొరేషన్ ఏర్పాటు చేసి, మౌలిక వసతులు, ప్రమాణాల మెరుగుకు ఖర్చు చేయాలని నిర్ణయించాం. విద్యపై చేసే వ్యయాన్ని ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూస్తున్నాం. విద్యా విధానంలో సిలబస్ రూపకల్పన, వనరుల సమీకరణ, విధానం అమలుపై స్పష్టత అవసరం..' అని రేవంత్ అన్నారు.

విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలి

'విద్యా విధానం కమిటీ చైర్మన్ కె.కేశవరావు మాట్లాడుతూ..విద్యాలయాల్లో విద్యార్థి కేంద్రంగా, నాణ్యతకు పెద్దపీట వేసేలా బోధన ఉండాలన్నారు. ఏకీకృత బోధన విధానం వల్లే తెలంగాణ విద్యారంగంలో మార్పు సాధ్యమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి చెప్పారు. ధనిక, పేద తారతమ్యం లేని, కులమతాల ప్రస్తావన లేని విద్యాలయాల ఏర్పాటు అవసరమన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, ప్రతి తరగతికీ గది, ఉపాధ్యాయుడు ఉండాలని మరో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య సూచించారు.

ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఐవీ సుబ్బారావు, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ శాంతాసిన్హా, విద్యావేత్తలు మోహన్ గురుస్వామి, సీఐఐ శేఖర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, అక్షర వనం మాధవరెడ్డి, ఫ్రొపెసర్ గంగాధర్, విశ్రాంత ఐఏఎస్‌లు మిన్నీ మాథ్యూ, రంజీవ్ ఆచార్య, తదితరులు నూతన విద్యా విధానంపై తమ అభిప్రాయాలు తెలియజేశారు. సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, ఉన్నతాధికారులు జయేశ్ రంజన్, దేవసేన, కృష్ణ ఆదిత్య, నవీన్ నికొలస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో 1,743 ఉద్యోగాల భర్తీ

ఉద్యోగ విరమణలతో భారీగా ఖాళీలు ఏర్పడినప్పటికీ, ఉన్న సిబ్బందితోనే ఆర్టీసీ నెట్టుకొస్తోంది. 2019లో ఒకేసారి ఏకంగా 2 వేల బస్సులను రద్దు చేయటం, పాత బస్సులను తుక్కుగా మార్చినప్పటికీ.. వాటి స్థానంలో చాలినన్ని కొత్త బస్సులు కొనకపోవటం తదితరాల వల్ల సమస్య తీవ్రత మరింత పెరగకుండా చూస్తూ వచ్చారు.

భారీగా పదవీ విరమణలు

సమీప భవిష్యత్తులో భారీగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్‌లు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. దీంతో డబుల్ డ్యూటీలు పెరిగి ఇప్పటికే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, ఇక మరింత భారం మోపితే పరిస్థితి అదుపు తప్పుతుందని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీల భర్తీకి ఆర్టీసీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. గతేడాదే ఇందుకు అనుమతి వచ్చినప్పటికీ ప్రక్రియ మాత్రం ప్రారంభం కాలేదు. గతంలో తనకు కావల్సిన సిబ్బందిని ఆర్టీసీనే సొంతంగా నియమించుకునేది. కానీ, ప్రభుత్వం దాన్ని మార్చి ప్రభుత్వ ఉద్యోగాల నియామక బోర్డులకు బాధ్యత అప్పగించింది. దీంతో డ్రైవర్లు, శ్రామిక్‌ల పోస్టుల భర్తీ ప్రక్రియ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డుకు దక్కింది.

వారికే ఎక్కువ అవకాశం...

డ్రైవర్ల సంఖ్య భారీగా తగ్గిపోవటంతో ఇటీవల ఆర్టీసీ తాత్కాలిక పద్ధతిలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను నియమించుకుంది. దాదాపు 1,100 మంది డ్రైవర్లు తాత్కాలిక పద్ధతిలో గత నాలుగు నెలలుగా పనిచేస్తున్నారు. ఇప్పుడు పూర్తిస్థాయి నియామకాలకు నోటిఫికేషన్ రావటంతో వారు దరఖాస్తు చేయనున్నారు. నాలుగు నెలల నుంచి ఆర్టీసీ బస్సులు నడుపుతున్న అనుభవం సంపాదించినందున వారికే ఎక్కువ అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. పదో తరగతి విద్యార్హత ఉండటంతో, ఆ అర్హత లేని వారికి మాత్రం అవకాశం ఉండదు.

వీరితోనే సరి...

వాస్తవానికి ఆర్టీసీలో ఉన్న డ్రైవర్ ఖాళీలు వేయికి మించి ఉన్నాయి. కానీ భవిష్యత్తులో భారీ సంఖ్యలో ఎలక్ట్రిక్ బస్సులను అద్దె ప్రాతిపదికన తీసుకోబోతున్నారు. ఇప్పటికీ నగరంలో 225 ఎలక్ట్రిక్ బస్సులు తిరుగుతుండగా, మరో రెండు నెలల్లో ఇంకో 275 బస్సులు రాబోతున్నాయి. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద వచ్చే మార్చి నుంచి క్రమంగా 2,800 బస్సులు హైదరాబాద్‌కు రానున్నాయి. జిల్లాల్లో కూడా 500 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి.

అద్దె బస్సులకు వాటి యజమానులే డ్రైవర్లను సమకూర్చాల్సి ఉన్నందున, ఆర్టీసీకి డ్రైవర్ల అవసరం తగ్గుతుంది. దీంతో ఇప్పుడు తీసుకునే వేయి మందితోనే ఉన్న బస్సులను తిప్పనున్నారు. ఇక 1500 కండక్టర్ పోస్టులను కూడా భర్తీ చేయాలని ఆర్టీసీ ప్రతిపాదించినప్పటికీ, నోటిఫికేషన్‌లో వాటి ఊసు లేదు. ఇటీవల 500 మంది తాత్కాలిక కండక్టర్లను ఆర్టీసీ నియమించుకుంది. తదుపరి విడత కండక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నారు.

ఆర్టీసీలో ప్రస్తుతం మెకానిక్‌లకు కూడా కొరత ఉంది. ఉన్న శ్రామిక్‌లకు పదోన్నతి ఇవ్వటం ద్వారా మెకానిక్ పోస్టులను భర్తీ చేస్తారు. ఇప్పుడు 743 శ్రామిక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చినందున, వారు రాగానే ఉన్న శ్రామిక్‌లకు మెకానిక్‌లుగా పదోన్నతి ఇవ్వనున్నారు.




# హైదరాబాద్‌లో దంచికొడుతున్న వాన.. చెరువులను తలపిస్తున్న రోడ్లు

భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రవాహంతో పలు చోట్ల ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. అమీర్‌పేట్‌లోని గాయత్రి నగర్‌లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. సీతాఫల్ మండిలో ప్రహరీ గోడ కూలింది. సురేష్ థియేటర్ సమీపంలో ఆటోపై గోడ కూలింది. ఆ సమయంలో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. రామ్‌గోపాల్ పేట్‌లోని బస్తీలు, చిల్కలగూడ, వారాసిగూడ, మెట్టుగూడ, ఈస్ట్ మారేడ్‌పల్లి అంబేద్కర్ నగర్, మియాపూర్ దీప్తిశ్రీ నగర్‌లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. ఒలిఫెంట రైల్వే వంతెన కింద భారీ వరద నీరు చేరడంతో సికింద్రాబాద్‌తార్నాక, ముషీరాబాద్ వైపు వెళ్లే రహదారులను పోలీసులు నిలిపివేశారు.

ముషీరాబాద్‌లో అత్యధిక వర్షపాతం

ముషీరాబాద్‌లో అత్యధికంగా 18.43 సెం.మీ వర్షపాతం నమోదైంది. సికింద్రాబాద్‌లో 13 సెం.మీ, శేరిలింగంపల్లిలో 12.6 సెం.మీ, చందానగర్‌లో 11.2 సెం.మీ, లింగంపల్లిలో 10.7 సెం.మీ, జూబ్లీహిల్స్‌లో 8.9 సెం.మీ, బేగంపేటలో 8.7 సెం.మీ, ఖైరతాబాద్‌లో 8.5 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: సీఎం

నగరంలో భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. నీళ్లు నిలిచిన, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన చోట్ల పోలీస్, ట్రాఫిక్, హైడ్రా విభాగాలు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాలు, నాలాలున్న చోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావొద్దన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తమైన హైడ్రా, డీఆర్ఎఫ్‌లు స్థానికులకు సహాయం చేయడానికి హెల్ప్ లైన్ నంబర్లను ఏర్పాటు చేశాయి. సహాయం కోసం 040 29560521, 9000113667, 9154170992 ఈ నెంబర్లకు ఫోన్ చేయాలని అధికారులు సూచించారు.

ముషీరాబాద్ ప్రాంతంలోని బాపూజీనగర్, వినోబానగర్‌లో వరద ఉద్ధృతంగా ప్రవహిస్తుంది. భోలక్‌పూర్ పద్మశాలి కాలనీ నుంచి గాంధీనగర్ వెళ్లే మార్గంలో రోడ్డు పూర్తిగా వరద నీటితో మునిగిపోయింది. గాంధీనగర్ రోడ్ నం.7లో వరద నీటిలో పలు ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. సికింద్రాబాద్ మనోహర్ థియేటర్ వద్ద రహదారిపై వర్షపు నీరు భారీగా ప్రవహిస్తోంది. కార్వాన్‌లో భారీ వర్షం పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అమీర్‌పేట్‌లోని గాయత్రి నగర్‌లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో తమను కాపాడాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో పర్యటించారు. వర్షాలు, స్థానిక సమస్యలపై అధికారులకు సూచనలు చేశారు. జీహెచ్ఎంసీ, హైడ్రా, వాటర్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లను అప్రమత్తం చేశారు. నిలిచిన నీటిని తొలగించడం, రోడ్లు శుభ్రం చేయడం వంటి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. భారీ వర్షం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న మేయర్ విజయలక్ష్మి కోరారు. రాజ్‌భవన్ సమీపంలో నాలాల్లో పెద్ద డబ్బాలు అడ్డం ఉండి భారీగా నీరు నిలిచిందని మేయర్ పేర్కొన్నారు. నాలాల్లో వ్యర్థాలు వేయొద్దని, డబ్బాలు, పరుపులు, సోఫాల వంటివి వేయరాదని సూచించారు.



# చాలా రాష్ట్రాల్లో సగం మందికి పైగా ఓటర్లు ఎస్ఐఆర్‌కు పత్రాలు ఇవ్వనవసరం లేదు




ఈ-కబురు, చాలా రాష్ట్రాల్లో సగం మందికిపైగా ఓటర్లు ఎస్ఐఆర్(సమగ్ర ఓటర్ల సవరణ)లో ఏ విధమైన పత్రాలూ సమర్పించాల్సిన అవసరం ఉండకపోవచ్చని ఎన్నికల కమిషన్ అధికారులు బుధవారం వెల్లడించారు. వారంతా ఆయా రాష్ట్రాల్లో గత ఎస్ఐఆర్‌లోనే ఓటర్లుగా నమోదవడమే దీనికి కారణమని పేర్కొన్నారు. చాలా రాష్ట్రాలు 2002, 2004 సంవత్సరాల మధ్య ఎస్ఐఆర్ నిర్వహించాయని తెలిపారు. గత ఎస్ఐఆర్ నిర్వహించిన సంవత్సరాన్నే తదుపరి ఎస్ఐఆర్‌కు కటాఫ్ తేదీగా పరిగణిస్తామని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మళ్లీ ఎప్పుడు ఎస్ఐఆర్ నిర్వహించాలో ఈసీ త్వరలో తేదీని నిర్ణయించనుంది. గత ఎస్ఐఆర్ తర్వాత ప్రచురించిన ఎన్నికల జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆయా రాష్ట్రాల ముఖ్య ఎన్నికల అధికారుల(సీఈవోల)ను ఇప్పటికే ఈసీ ఆదేశించింది. కొన్ని రాష్ట్రాల సీఈవోలు ఇప్పటికే ఆ జాబితాలను తమ వెబ్‌సైట్‌లలో ఉంచారు. ఢిల్లీలో చివరిసారిగా 2008 సంవత్సరంలో ఎస్ఐఆర్ నిర్వహించడంతో 2008 నాటి ఓటర్ల జాబితాను ఢిల్లీ సీఈవో వెబ్‌సైట్‌లో ఉంచారు. అలాగే, ఉత్తరాఖండ్ సీఈవో 2006 నాటి ఓటర్ల జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు. కాగా, బిహార్‌లో 2003లో ఎస్ఐఆర్ నిర్వహించడంతో అప్పుడు ఓటర్లుగా నమోదైన 4.96 కోట్ల మంది(ప్రస్తుత ఓటర్లలో దాదాపు 60శాతం మంది) తాజా ఎస్ఐఆర్‌లో ఎలాంటి పత్రాలూ సమర్పించాల్సిన అవసరం లేదని అధికారులకు ఈసీ సూచించింది. కాగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఓటర్ల కోసం అదనంగా మరో డిక్లరేషన్ ఫామ్‌ను పొందుపరిచారు. వీరంతా 1987 జూలై 1వ తేదీకి ముందు భారతదేశంలోనే పుట్టామని నిర్ధారించేందుకు ఏదైనా పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, 1987 జూలై 1-2004 డిసెంబరు 2వ తేదీ మధ్య పుట్టిన దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పుట్టిన తేదీ, స్థలం నిర్ధారించే పత్రాలను కూడా సమర్పించాలి.

మొదటి పేజీ తరువాయి

# గచ్చిబౌలిలో ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

## 6 గ్రాముల బంగారు బ్రాస్లెట్ స్వాధీనం

ఈకబురు, శేరిలింగంపల్లి : గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలోని ఓ సాఫ్ట్వేర్ కార్యాలయం ముందు సాఫ్ట్వేర్ ఉద్యోగిని వద్ద స్నాచింగ్ కు పాల్పడిన ఇద్దరు నిందితులను గచ్చిబౌలి పోలీసులు రెండు రోజుల్లోనే అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఉద్యోగిని వద్ద స్నాచింగ్ చేసిన 6 గ్రాముల బంగారు బ్రాస్లెట్ ను స్వాధీనం చేసుకున్నారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు బుధవారం మాదాపూర్ ఏసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసిపి శ్రీధర్ వెల్లడించారు..

హైదరాబాద్ నగరం పరిధిలోని మలకపేట ఉస్మాన్ పురాలో నివాసం ఉంటూ ఈవెంట్ మేనేజిమెంట్ ఉద్యోగం చేస్తున్న చిక్కుల నరేందర్(24), కాచీగూడ పరిధిలోని రాంకోటిలో ఉంటూ పెంపుడు జంతువుల గ్రూమింగ్ ఉద్యోగం చేస్తున్న అన్నవరం అశీష్ కుమార్(24)లు స్నేహితులు. వీరు సులభంగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఈనెల 15వ తేదీన గచ్చిబౌలి ఐటి కారిడార్ కు ద్విచక్రవాహనం (టిఎస్09 బి9320) మీద వచ్చారు. అమెజాన్ సాఫ్ట్వేర్ సంస్థ ముందు క్యాబ్ కోసం వేచి ఉన్న సాఫ్ట్వేర్ ఉద్యోగిని రేలా గౌడ్ ను అడ్డగించిన నరేందర్ ఉద్యోగాల విషయమై అడిగి మాటల్లో పెట్టాడు. రేలాగౌడ్ ఏమరుపాటుగా ఉన్న సమయంలో ఆమె చేతికి ఉన్న 6 గ్రాముల బంగారు బ్రాస్లెట్ స్నాచింగ్ చేసి అక్కడి నుంచి ఆశీష్ కుమార్ నడుపుతున్న ద్విచక్రవాహనం మీద పరారయ్యాడు. దీనిపై బాధితురాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఈమేరకు బుధవారం గచ్చిబౌలిలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 6 గ్రాముల బ్రాస్లెట్, 2 మొబైల్ ఫోన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో గచ్చిబౌలి ఇనిస్పెక్టర్ హబీబుల్లాఖాన్, డిటెక్టివ్ ఇనిస్పెక్టర్ నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ ఏసిపి శ్రీధర్

# భారత కాన్సులేట్‌ను ముట్టడిస్తాం




**కెనడాలోని ఖలిస్థానీ సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' హెచ్చరిక**

**నేడు కాన్సులేట్‌కు వెళ్లొద్దని ఇండో-కెనడియన్లకు సూచన**

ఈకబురు,వాంకోవర్, : కెనడాలోని వాంకోవర్ నగరంలో ఉన్న భారత కాన్సులేట్‌ను గురువారం 12 గంటలపాటు ముట్టడించనున్నామని ఖలిస్థానీ వేర్పాటువాద సంస్థ 'సిక్స్ ఫర్ జస్టిస్' హెచ్చరించింది. అందువల్ల గురువారం భారత కాన్సులేట్‌కు వెళ్లొద్దని ఇండోకెనడియన్లకు ఒక ప్రకటనలో సూచించింది. భారత కాన్సులేట్ కెనడాలో గూఢచర్య నెట్‌వర్క్‌ను నడుపుతోందని, ఖలిస్థానీలపై నిఘా పెట్టిందని ఆ ప్రకటనలో ఆరోపించింది. దీనిపై కాన్సులేట్‌ను జవాబుదారీ చేయాలనే డిమాండుతో ఖలిస్థాన్ అనుకూలురైన సిక్కులు ఈ ముట్టడి నిర్వహించనున్నట్టు తెలిపింది. 'హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజంట్ల పాత్ర గురించి దర్యాప్తు జరుగుతోందని రెండేళ్ల క్రితమే నాటి ప్రధాని జస్టిన్ ట్రూడో పార్లమెంటుకు తెలిపారు. రెండేళ్లు దాటినా భారత కాన్సులేట్‌లు కెనడాలో గూఢచర్య నెట్‌వర్క్‌లను నడుపుతూనే ఉన్నాయి. ఖలిస్థాన్ ఉద్యమకారులపై నిఘా కొనసాగిస్తూనే ఉన్నాయి' అని ఆ ప్రకటనలో ఆరోపించింది. కెనడాలోని భారత నూతన రాయబారి దినిశ్ పట్నాయక్ లక్ష్యంగా ఆయన ఫొటోతో ఒక పోస్టరును కూడా విడుదల చేసింది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఇరుదేశాల మధ్య రెండేళ్లుగా దెబ్బతిన్న సంబంధాల పునరుద్ధరణలో భాగంగా భారత్, కెనడా దేశాలు పరస్పరం కొత్తగా రాయబారులను నియమించుకొన్న వారం రోజులకే ఖలిస్థానీల నుంచి తాజా బెదిరింపులు రావడం గమనార్హం. 2023 జూన్‌లో వాంకోవర్‌లోని ఒక సిక్కు ఆలయం బయట ఇద్దరు సాయుధులు నిజ్జర్‌ను కాల్చి చంపారు. ఈ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని కెనడా ఆరోపించింది. నాటి భారత రాయబారితోపాటు అనేకమంది దౌత్యవేత్తలను దేశం నుంచి బహిష్కరించింది. కెనడా ఆరోపణలను తోసిపుచ్చిన భారత్ కూడా అంతే తీవ్రంగా స్పందించింది. కెనడా రాయబారి సహా ఆ దేశానికి చెందిన ఆరుగురు సీనియర్ దౌత్యవేత్తలను భారత్ నుంచి వెళ్లిపోవాలని ఆదేశించింది.

# మావోయిస్టు లేఖల కలకలం



తమ పార్టీ క్యాడర్ పలు సందర్భాల్లో పోలీసులను సమర్థంగా ఎదుర్కొంటోందని, పోలీసులకు జరిగిన నష్టాన్ని, మరణాలను వెల్లడించడం లేదని పేర్కొన్నారు. కర్రెగుట్టల వద్ద అమర్చిన బూబీ ట్రాప్‌ల్లో చిక్కుకుని దాదాపు 50 మందికి పైగా పోలీసులు మరణించారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దాచిపెడుతోందని ఆరోపించారు. అలాగే కర్రెగుట్టల సమీపంలో తమకు, గ్రేహౌండ్స్ పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు కానిస్టేబుళ్లు మరణించారని, పోలీసులు ఆ విషయాన్ని మార్చి చెప్పారని లేఖలో ప్రస్తావించారు. ఇటీవల మావోయిస్టు సీనియర్ నేత పోతుల పద్మావతి డీజీపీ జితేందర్ సమక్షంలో లొంగిపోయిన క్రమంలో మావోయిస్టు లేఖ, గ్రేహౌండ్స్ కానిస్టేబుళ్ల మరణాలపై 'ఆంధ్రజ్యోతి' విలేకరి అడిగిన ప్రశ్నకు.. మైండ్‌గేమ్‌లో భాగంగానే మావోయిస్టులు ఆ లేఖను జారీ చేసి ఉండొచ్చని డీజీపీ బదులిచ్చారు. అంటే మావోయిస్టులు లేఖల ద్వారా మైండ్‌గేమ్ ఆడుతున్నారని ఆయనే అంగీకరించారన్నమాట. మావోయిస్టులతో చర్చలు జరపాలని శాంతి సంఘా లు కోరుతుండగా.. ఆయుధాలు వదిలి లొంగిపోవాలని, వారితో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పలుమార్లు స్పష్టం చేశారు.

**పార్టీలో సమన్వయ లోపం?**

ఆయుధాలు వదిలిపెట్టే విషయంలో మావోయిస్టు పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు సమాచారం. ఆపరేషన్ కగార్ ప్రారంభమైన తర్వాత మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, పొలిట్‌బ్యూరో మధ్య సమాచార, సమన్వయ లోపం ఉన్నట్లు తెలుస్తోంది. పోతుల పద్మావతి లొంగుబాటుకు మే నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాను లొంగిపోవాలనుకుంటున్న విషయాన్ని పద్మావతి కేంద్ర కమిటీ బాధ్యులకు, పొలిట్ బ్యూరోకు తెలియజేసింది. కానీ, వారి నుంచి అనుమతి రావడానికి 4 నెలలు పట్టింది. మావోయిస్టు పార్టీ నూతన సారథిగా పోటీలో ఉన్న మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ తనకు ఆ స్థానం దక్కకపోవడంతోనే ఈ లేఖ విడుదల చేశారా? పార్టీ నుంచి ఆయన విడిపోవడానికి నిర్ణయించుకున్నారా? లేక మల్లోజుల పేరిట లేఖను సృష్టించి, పార్టీలో ఆయనపై అనుమానాలు రేకెత్తించడానికి పోలీసులు చేసిన ప్రయత్నమా? అన్న విషయంలో వామపక్ష మేధావుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# ఇది పొంతన లేని తీర్పు



ఈకబురు,హైదరాబాద్:గ్రూప్1 పరీక్ష నిర్వహణ, ఫలితాలకు సంబంధించి సింగిల్ జడ్జి పొంతన లేని తీర్పు వెలువరించారని హైకోర్టుకు టీజీపీఎస్సీ నివేదించింది. ఒకవైపు పునర్మూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లో మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశిస్తూ... లేకపోతే పరీక్షను రద్దు చేస్తామంటూ పరస్పర విరుద్ధంగా తీర్పు ఇచ్చారని పేర్కొంది. అభ్యర్థుల సంఖ్య, మూల్యాంకనం, వేర్వేరు హాల్‌టికెట్లు, పరీక్ష కేంద్రాల కేటాయింపు సహా పిటిషనర్లు లేవనెత్తిన అన్ని సందేహాలను నివృత్తి చేశామంది. తమ వాదనలను, సమర్పించిన ఆధారాలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోకుండా సుప్రీంకోర్టు తీర్పులకు భిన్నంగా చట్టవిరుద్ధమైన తీర్పు వెలువరించారని తెలిపింది. సుప్రీంకోర్టు వెలువరించిన పలు తీర్పుల్లో పేర్కొన్న 'వక్రమైన తీర్పుల' పరిధిలోకి ఇది వస్తుందని పేర్కొంది. రీవాల్యుయేషన్ నిర్వహించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశం... టీజీపీఎస్సీ నిబంధన 3(9)(డి)కి విరుద్ధమంది. ఆధారాల్లేని ఆరోపణల నేపథ్యంలో పరీక్షను తిరిగి నిర్వహించడం చెల్లదని, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరింది. గ్రూప్1 మెయిన్స్ జవాబు పత్రాలను పునర్మూల్యాంకనం చేయాలని లేదా 8 నెలల్లో మళ్లీ పరీక్ష నిర్వహించాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో బుధవారం అప్పీలు దాఖలు చేసింది. బాధితులను (ఎంపికైనవారిని) ప్రతివాదులుగా చేర్చకుండా దాఖలు చేసిన పిటిషన్లు విచారణార్హం కాదని గుర్తించడంలో సింగిల్ జడ్జి విఫలమయ్యారంది. ఈ తీర్పును రద్దు చేయాలని కోరింది. అప్పీలులో 222 మందిని ప్రతివాదులుగా పేర్కొంది.

**అప్పీలులోని ప్రధాన అంశాలు**

మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసం ఉందన్న ఆరోపణపై ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకోవడంలో సింగిల్ జడ్జి విఫలమయ్యారు. పరీక్ష ముగిసిన వెంటనే చీఫ్ సూపరింటెండెంట్ల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం తాత్కాలిక సంఖ్యను ప్రకటిస్తారు. బయోమెట్రిక్, జవాబు పత్రాలను స్కాన్ చేసిన తరువాత వాస్తవ వివరాలు వెల్లడవుతాయి. పరీక్షకు గైర్హాజరైనవారి వివరాలను పరిగణనలోకి తీసుకుని చీఫ్ సూపరింటెండెంట్లు ఇచ్చిన వివరాలకు... బయోమెట్రిక్, జవాబు పత్రాల స్కాన్ తరువాత వచ్చిన సంఖ్యకు తేడా 17 మాత్రమే. దీనివల్ల కోర్టును ఆశ్రయించిన అభ్యర్థులకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

ఫోర్జరీపత్రం ద్వారా బి.పూజితారెడ్డి మార్కులు తగ్గాయన్న ఆరోపణలను పరిగణనలోకి తీసుకోరాదు. గతంలో ఇలాంటి ఆరోపణపై దాఖలైన పిటిషన్‌ను ఇదే కోర్టు కొట్టివేసింది. పూజితారెడ్డిని ప్రతివాదిగా చేర్చాలని సింగిల్‌జడ్జి ఆదేశించినా పిటిషనర్లు పట్టించుకోలేదు. మార్కులపై అభ్యంతరం లేదంటూ ఆమె ఇచ్చిన అఫిడవిట్‌నూ, ఆమెపై ఉన్న కేసునూ పట్టించుకోలేదు. ఫోర్జరీ మార్కుల జాబితా ద్వారా కోర్టును వారు తప్పుదోవ పట్టించారు.

ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్ల జారీపై కమిషన్ ఇచ్చిన వివరణను పట్టించుకోలేదు. రాజ్యాంగ సంస్థ అయిన కమిషన్... నియామకాల నిమిత్తం నిర్వహించే పరీక్షల్లో స్వీయ పద్ధతులను అనుసరించవచ్చు.

నోటిఫికేషన్‌లో ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు ఒకే హాల్‌టికెట్ ఉంటుందని ఎక్కడా పేర్కొనలేదు. అందువల్ల వేర్వేరు హాల్‌టికెట్లు కేటాయించడం నోటిఫికేషన్‌కు విరుద్ధమంటూ తప్పుబట్టడం సరికాదు. యూపీఎస్సీ విధానాన్ని అనుసరించకపోవడాన్ని సింగిల్ జడ్జి తప్పుబట్టారు. అలా అనుసరించాలని ఎలాంటి చట్టమూ లేదు. పరీక్షకు వారం రోజుల ముందే హాల్‌టికెట్ల వివరాలను వెల్లడించినా పరీక్షలు ముగిశాక ప్రతివాదులు అభ్యంతరాలు లేవనెత్తారు. ఈ కారణంతో పిటిషన్‌ను కొట్టివేయాల్సి ఉండగా... కమిషన్ వాదనను న్యాయమూర్తి తిరస్కరించారు.

అధికారులు పంపిన వివరాల ప్రకారం... మొదట 45 కేంద్రాలుగా నిర్ణయించినప్పటికీ ఒక కేంద్రం ఎత్తు ఎక్కువగా ఉండటంతో 87 మంది దివ్యాంగుల సౌలభ్యం కోసం సర్దుబాటు చేయడంతో మరో కేంద్రం పెరిగింది.

కోఠి మహిళా కళాశాలలో కేవలం మహిళా అభ్యర్థులనే కేటాయించడంపై ఆరోపణ సరికాదు. పురుషులకు ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యం లేదన్న కాలేజీ యాజమాన్యం సూచనల ప్రకారమే కేటాయింపు జరిగింది. ఈ పరీక్ష కేంద్రానికి సంబంధించిన అభ్యర్థుల జవాబుపత్రాల మూల్యాంకనంలో మూల్యాంకనదారులు ఉదారంగా వ్యవహరించారని, మొదటి 500 మందిలో 14.8 శాతం మంది ఈ కేంద్రానికి చెందినవారు ఉన్నారన్న ఆరోపణకు ఆధారాలు లేవు. రెండు కేంద్రాల్లోని ఫలితాలు కూడా మిగిలిన కేంద్రాలతో సమానంగానే వచ్చాయి. 18, 19 సెంటర్లలో 5.41%... 4.12% వచ్చాయి. 6 కేంద్రాల్లో 5 కంటే ఎక్కువ శాతం ఫలితాలు వచ్చాయి. ఫలితాల గణాంకాలను కోర్టు తప్పుగా పరిగణనలోకి తీసుకుంది.

మూల్యాంకనంలో మోడరేషన్ విధానాన్ని అనుసరించలేదని సింగిల్ జడ్జి తప్పుబట్టారు. మూల్యాంకనాన్ని చీఫ్ ఎగ్జామినర్ పర్యవేక్షించారు. కొన్నింటిని స్వయంగా మూల్యాంకనం చేసి తేడాలుంటే మార్గదర్శకాలు జారీ చేశారు. స్వతంత్ర మూల్యాంకనదారులతో రెండుసార్లు మూల్యాంకనం చేయించాం. అవసరమైనచోట మూడోసారీ చేపట్టాం. అవసరమైతేనే మోడరేషన్ విధానాన్ని అనుసరించాల్సి ఉంటుందని, ఇక్కడ ఆ అవసరం రాలేదని చెప్పినా సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు.

కార్పొరేట్ ఉద్యోగానికి రాజీనామా చేసి 10 నుంచి 12 గంటలు చదివినా సింగిల్ డిజిట్ మార్కులు వచ్చాయన్న అభ్యర్థి నైపుణ్యం ఆధారంగా పరీక్ష నిర్వహణను ప్రశ్నించడం సరికాదు. జవాబుల 'కీ'కి సంబంధించి కమిషన్ విరుద్ధమైన వైఖరి అనుసరించిందని జడ్జి పేర్కొన్నప్పటికీ అభ్యర్థులెవరూ 'కీ'ని కోరలేదు. జవాబులకు సంబంధించి సరైన వివరణ లేదనడానికి ఎలాంటి ఆధారాలు లేవు.

ఎక్కువ మంది అభ్యర్థులు హాజరైన సందర్భాల్లో పలువురికి ఒకే రకమైన మార్కులు రావడం సహజమే. పక్కపక్కనే ఉన్న అభ్యర్థులకు ఒకే రకమైన మార్కులు వచ్చినప్పటికీ... వేర్వేరు పేపర్లలో మార్కుల్లో తేడా ఉంటుంది. 719 మంది ఒకే రకమైన మార్కులు సాధించారన్న కారణానికి కమిషన్ ఇచ్చిన గణాంకాలను, వివరణను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదు.ఇంగ్లిష్‌లో అర్హత సాధించనివారి జవాబు పత్రాలను మూల్యాంకనం చేయడం ద్వారా కమిషన్ తన నిబంధనలనే ఉల్లంఘించిందని జడ్జి పేర్కొన్నారు. ఇంగ్లిష్ జవాబు పత్రాల మూల్యాంకనం తొలుత చేస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. అన్ని జవాబు పత్రాల మూల్యాంకనం ఒకేసారి జరుగుతుంది. అలాంటప్పుడు ఇంగ్లిష్‌కంటే ముందు మిగతావి జరగవచ్చు.మూడు భాషల్లో నిపుణులైనవారు మూల్యాంకనం నిర్వహించగా ఎలాంటి ఆధారాలు లేకుండా తెలుగు మాధ్యమంలో రాసిన వారికి అన్యాయం జరిగిందని జడ్జి తప్పుగా భావించారు.

# ఒకే ఉత్తర్వు.. 16 ప్రాజెక్టులు




ఈ-కబురు,హైదరాబాద్: కృష్ణా బేసిన్‌లో అదనపు నీటి వినియోగానికి, కొత్త రిజర్వాయర్ల నిర్మాణానికి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వినియోగంలో ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యం పెంపు, గతంలో సర్వేల కోసం ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత ముందుకు పడని పలు ప్రాజెక్టులను తెరపైకి తెచ్చింది. మొత్తం 16 పథకాలకు సర్వే, ఇన్వెస్టిగేషన్, సమగ్ర ప్రాజెక్టు నివేదికల తయారీకి నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు (జీవో ఎం.ఎస్.నం-34) జారీ చేశారు. మంగళవారం జారీ చేసిన ఈ ఉత్తర్వు బుధవారం వెలుగు చూసింది. ఇన్ని పథకాలకు ఒకేసారి, అదీ ఒకే ఉత్తర్వుతో డీపీఆర్‌ల తయారీకి ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకొంది. కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ పలు దఫాలుగా నీటిపారుదలశాఖ అధికారులు, సీనియర్ న్యాయవాదులు, సలహాదారులు, అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం ఇంజినీర్లతో చర్చించిన తర్వాత అన్ని పథకాలకు ఒకేసారి ఆదేశాలు జారీ అయ్యాయి.

**ముఖ్య వివరాలివీ...**

ఈ నెల 23 నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో వచ్చిన జీవోలోని ముఖ్యమైన అంశాలు, ఏయే పథకాలకు డీపీఆర్ తయారీ అన్న వివరాలు ఇలా ఉన్నాయి.

రేలంపాడు బ్యాలన్సింగ్ రిజర్వాయర్‌ను నాలుగు నుంచి పది టీఎంసీలకు పెంచడం. గట్టు బ్యాలన్సింగ్ రిజర్వాయర్ సామర్థ్యం 1.32 నుంచి ఐదు లేదా పది టీఎంసీల సామర్థ్యానికి పెంపు. జూరాల నుంచి నాలుగు టీఎంసీలు తీసుకొని అదనంగా 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు నెట్టెంపాడు రెండోదశ.

పులిచింతల వెనకభాగం నుంచి బొజ్జతాండా, భీమతాండా ఎత్తిపోతలు. 0.5 టీఎంసీ వినియోగంతో మట్టంపల్లి మండలంలోని మూడు గ్రామాల్లో 1,380 ఎకరాల ఆయకట్టుకు నీరందించడం.

కల్వకుర్తి ఎత్తిపోతల రెండోదశ కింద శ్రీశైలం నుంచి 13 టీఎంసీలను మళ్లించి 93,531 ఎకరాల అదనపు ఆయకట్టు సాగులోకి. ఇందుకోసం కాలువలు, హెడ్‌వర్క్స్ సామర్థ్యం పెంచడంతోపాటు తాగునీటికి 7.12 టీఎంసీలు వినియోగించుకొనేలా మౌలిక సదుపాయాల కల్పనకు నివేదిక తయారీ.

జూరాల నుంచి రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 టీఎంసీలు మళ్లించేలా వరద కాలువ పథకం. నల్గొండ, వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లో 11.3 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు... మార్గం మధ్యలో చెరువులను నింపడం. జూరాల వెనక భాగం నుంచి వరద సమయంలో 123 టీఎంసీలను మహబూబ్‌నగర్ జిల్లాలోని దుర్భిక్ష ప్రాంతాలకు సరఫరా చేయడం.

కోయిల్‌సాగర్ కింద 3.3 టీఎంసీలతో అదనంగా 13,500 ఎకరాలకు సాగునీరు.

మహబూబాబాద్ జిల్లాలో 1.3 టీఎంసీలతో 13,201 ఎకరాలకు సాగు నీరిచ్చేందుకు మహబూబాబాద్ మండలం ఏదులపూసపల్లి వద్ద మున్నేరు నదిపై బ్యారేజీ నిర్మాణం. ఇదే జిల్లాలోని మరిపెడ మండలం విసంపల్లి గ్రామం వద్ద ఆకేరు నదిపై 1.2 టీఎంసీలతో బ్యారేజీ నిర్మాణం. గార్ల మండలం ముల్కనూరు గ్రామం వద్ద 11,871 ఎకరాలకు నీరిచ్చేందుకు మున్నేరుపై 1.2 టీఎంసీలతో బ్యారేజీ.

మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం ముల్కపల్లి వద్ద 25 నుంచి 35 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణం.

ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం ఏదులచెరువు గ్రామం వద్ద ఆకేరు నదిపై బ్యారేజీ నిర్మించి 1.3 టీఎంసీల వినియోగంతో 13,129 ఎకరాలకు నీటిసరఫరా.

శ్రీశైలం ఎడమగట్టు కాలువకు కొనసాగింపుగా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామం వద్ద నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్ రోజుకు ఒక టీఎంసీ చొప్పున మళ్లించి 35 టీఎంసీల వినియోగంతో 3.99 లక్షల ఎకరాల అదనపు ఆయకట్టుకు

# వస్తున్నాయ్ కొత్త ఐపీవోలు.. కొనుక్కోండి షేర్లు




సోలార్ ఫొటో వోల్టాయిక్ మాడ్యూళ్ల తయారీ కంపెనీ సాత్విక్ గ్రీన్ ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి రూ. 442-465 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 19న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 700 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 200 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 23న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 900 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. కంపెనీ లిస్టయితే రూ. 5,910 కోట్ల మార్కెట్ విలువను అందుకునే వీలుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను కేటాయించనుంది.

ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 477 కోట్లు సాత్విక్ సోలార్ ఇండస్ట్రీస్‌లో ఇన్వెస్ట్ చేయనుంది. ఒడిషాలోని గోపాల్‌పూర్ ఇండ్రస్టియల్ పార్క్‌లో 4 గిగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. మరో రూ. 166.5 కోట్లు అనుబంధ సంస్థ రుణ చెల్లింపులకు వినియోగించనుంది. 2025 జూన్30కల్లా 3.8 గిగావాట్ల సోలార్ ఫొటోవోల్టాయిక్ మాడ్యూల్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. సోలార్ ప్రాజెక్టులకు ఎండ్‌టుఎండ్ ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణ సంబంధ సర్వీసులను కంపెనీ సమకూర్చుతోంది.

**జీకే ఎనర్జీ @ రూ. 145-153**

సౌర విద్యుత్ (సోలార్ పవర్) ఆధారిత వ్యవసాయ నీటి పంప్ సిస్టమ్స్ అందించే జీకే ఎనర్జీ పబ్లిక్ ఇష్యూకి రూ. 145-153 ధరల శ్రేణి ప్రకటించింది. ఈ నెల 19న ప్రారంభంకానున్న ఇష్యూలో భాగంగా రూ. 400 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 65 కోట్ల విలువైన 42 లక్షల షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి 23న ముగియనున్న ఇష్యూ ద్వారా రూ. 465 కోట్లు సమకూర్చుకునే యోచనలో ఉంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 18న షేర్లను విక్రయించనుంది.

ఈక్విటీ జారీ నిధుల్లో దాదాపు రూ. 323 కోట్లు కంపెనీ దీర్ఘకాలిక వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. సోలార్ పవర్ వ్యవసాయ పంప్ సిస్టమ్స్‌కు కంపెనీ పూర్తిస్థాయిలో ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కమిషనింగ్ (ఈపీసీ) సేవలు సమకూర్చుతోంది. తద్వారా రైతులకు వీటికి సంబంధించిన సర్వే, డిజైన్, సప్లై, అసెంబ్లీ, ఇన్‌స్టలేషన్, టెస్టింగ్, నిర్వహణ తదితర ఏకీకృత సర్వీసులు అందిస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 98 షేర్లకు (ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది.

# రూ.14 కోట్లు.. రూ.390 కోట్లు అయ్యాయ్




**కంపెనీ ప్రారంభ దశలో పెట్టుబడులు పెట్టిన వారికి, కొన్ని సందర్భాల్లో అనూహ్య లాభాలు వస్తుంటాయి. సిలికాన్ వ్యాలీకి చెందిన వెంచర్ క్యాపిటల్ దిగ్గజ సంస్థ యాక్సెల్.. 2 కంపెనీల పెట్టుబడులపై భారీ ప్రతిఫలాన్ని ఆర్జించింది. ఫేస్‌బుక్ ప్రారంభంలోనే పెట్టుబడులు పెట్టిన యాక్సెల్ మంచి రాబడిని పొందగా, ఇప్పుడు మనదేశంలో అర్బన్ కంపెనీ ద్వారా ఇదేవిధంగా లాభపడింది. ఇంట్లోకి అవసరమైన సేవలు అందించే అర్బన్ కంపెనీలో దశాబ్దం క్రితం యాక్సెల్ రూ.14.3 కోట్ల పెట్టుబడి పెట్టింది. అప్పట్లో రూ.3.77 చొప్పున షేరును ఈ కంపెనీ కొనుగోలు చేసింది. ఇప్పుడు ఐపీఓ ద్వారా అర్బన్ షేరు రూ.103 చొప్పున విక్రయించారు. ఫలితంగా యాక్సెల్ పెట్టుబడి విలువ రూ.390 కోట్లకు చేరింది.**

**అర్బన్ కంపెనీ షేరు ఆకర్షణీయంగా నమోదైంది. ఇష్యూ ధర రూ.103తో పోలిస్తే బీఎస్ఈలో 56.31% లాభంతో రూ.161 వద్ద లిస్టయింది. ఒక దశలో 73.78% లాభంతో రూ.179 స్థాయిని తాకింది. చివరకు 62.18% లాభంతో రూ.167.05 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.23,986.74 కోట్లుగా నమోదైంది.**

# మధ్యతరగతికి ఉపశమనం కల్పించేలా జీఎస్టీ సంస్కరణలు: నిర్మలా సీతారామన్



విశాఖపట్నం: దేశంలోని 140 కోట్ల మందికి వర్తించే జీఎస్టీ (GST)పై పెద్ద నిర్ణయం తీసుకున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు ఈనెల 22 నుంచి అమల్లోకి వస్తాయని చెప్పారు. విశాఖపట్నంలోని మధురవాడలో జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడారు.

"ఇప్పటికే అనేక రంగాల్లో జీఎస్టీ ప్రయోజనాలు చేకూరాయి. నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకు తగ్గించాం. 12 శాతంలో ఉండే వస్తువులు దాదాపు 99 శాతం 5 శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చాం. 28 శాతం శ్లాబ్‌లో ఉండే సిమెంట్ సహా 90 శాతం వస్తువులు 18 శాతం శ్లాబ్ పరిధిలోకి తెచ్చాం. 2017కు ముందు 17 రకాల పన్నులు ఉండేవి.. వాటిపై 8 సెస్సులు కూడా ఉండేవి. ఉదాహరణకు 2017కు ముందు సబ్బు ధర ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉండేది. అన్నింటినీ కలిపి దేశవ్యాప్తంగా ఒకే పన్ను.. నాలుగు శ్లాబ్‌ల రూపంలో తీసుకొచ్చిందే జీఎస్టీ. 201718 ఆర్థిక సంవత్సరంలో జీఎస్టీ ద్వారా రూ.7.19లక్షల కోట్ల ఆదాయం వచ్చింది. 202425 ఆర్థిక సంవత్సరంలో రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం లభించింది. ప్రజలపై భారం తగ్గించేందుకే జీఎస్టీ తీసుకొచ్చాం. పాలు, పెరుగు సహా పలు నిత్యావసరాలను 5 శాతం శ్లాబ్ నుంచి సున్నా శాతానికి తీసుకొచ్చాం. మధ్యతరగతికి ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకున్నాం. కారు, ఫ్రిజ్, ఏసీని 28 శాతం నుంచి 18 శాతానికి తీసుకొచ్చాం. ఆత్మనిర్భర్ భారత్‌కు జీఎస్టీ నూతన సంస్కరణలు పెద్ద ఊతం. మహిళల ఆరోగ్యం కోసం శానిటరీ న్యాప్‌కిన్స్‌పై పన్నును సున్నా చేశాం. యూపీఏ ప్రభుత్వంలో 30 శాతం ఉన్న వస్తువులను ఇప్పుడు 5 శాతానికి తెచ్చాం. సరళతరమైన పన్ను విధానాన్ని తీసుకురాలేని వాళ్లు ఇప్పుడు విమర్శలు చేస్తారా? గతంలో 65 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉండేవాళ్లు. ఈ 8 ఏళ్లలో ఆ సంఖ్య 1.51 కోట్లకు చేరింది." అని నిర్మలా సీతారామన్ వివరించారు.

# వెండి దిగుమతులు మళ్లీ జోరుగా!

రాబోయే నెలల్లో మన దేశం వెండిని భారీగా దిగుమతి చేసుకునే అవకాశం ఉంది. ఈ లోహంపై పెట్టుబడులు భారీగా పెరుగుతుండటం, పారిశ్రామిక గిరాకీ ఇందుకు దోహదపడొచ్చని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది (2025)లో వెండి దిగుమతులు 5,5006,000 మెట్రిక్ టన్నుల మధ్య ఉండే అవకాశం ఉందని అంచనా. గతేడాది దిగుమతి అయిన 7,669 టన్నులతో పోలిస్తే తక్కువే. అయితే ఈ ఏడాది తొలి 8 నెలల్లో వెండి దిగుమతి గతేడాది ఇదేసమయంతో పోలిస్తే, ఈసారి సగానికే పరిమితమైంది. ధరలను పరిశీలిస్తూ వేచి చూసిన పెట్టుబడిదారులు..వెండి ఇంకా మెరిసిపోతుందనే అంచనాకు రావడం వల్లే, కొత్తగా పెట్టుబడికి ముందుకు వస్తున్నారు. అందువల్ల ఇప్పటి నుంచి వెండి దిగుమతి భారీగా పెరుగుతుందనే అంచనా ఉంది.

**పాత నిల్వలు అయిపోతున్నందునే..**

గతేడాది (2024)లో దేశంలోకి వెండి దిగుమతి అంతకుముందు ఏడాది కంటే రెట్టింపు అధికమై 7,669 టన్నులుగా నమోదైంది. ఇందులో తొలి 8 నెలల్లోనే 5,695 టన్నుల వెండి వచ్చింది. ఈ ఏడాది తొలి 8 నెలల్లో మాత్రం 2,580 టన్నుల వెండి మాత్రమే దిగుమతి అయినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తాత్కాలిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గతేడాది మిగులును ఇప్పటికే దేశీయంగా వినియోగించినట్లు సమాచారం. దీంతో బ్యాంకులు, డీలర్లు మళ్లీ వెండి దిగుమతికి ఆర్డర్లు ఇస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద వెండి వినియోగదారుగా మన దేశం ఉంది. ఇప్పటికే అంతర్జాతీయంగా వెండి ధరలు 14 ఏళ్ల గరిష్ఠానికి చేరగా, భారత్‌లో డాలర్ వల్ల మరింత అధికంగా ఉంది.

**భారీగా పెట్టుబడులు**

కిలో వెండి ధర రూ.లక్షకు చేరే వరకు పెట్టుబడిదారులు ఆచితూచి వ్యవహరించారు. ఆ తదుపరి కూడా ధరలో దిద్దుబాటు అనేదే లేకుండా, మరింత పెరుగుతున్నందున.. వెండిపై పెట్టుబడులు ఊపందుకున్నట్లు డీలర్లు చెబుతున్నారు.

హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ.1,32,700కు చేరింది. ఔన్సు (31.10 గ్రాములు)గా చెప్పాలంటే ఇది 42.63 డాలర్లుగా ఉంది. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు వెండి ధర దాదాపు 49% పెరిగింది. ఇదే సమయంలో పసిడి ధర 44% రాణించింది. ఈ లోహాలపై దిగుమతి సుంకం 6% కాగా, జీఎస్టీ మరో 3% ఉండటం.. దేశీయంగా డాలర్ విలువ రూ.88.09కు చేరడం కూడా ఈ లోహాల ధరలు కొండెక్కడానికి కారణాలుగా ఉన్నాయి.

వెండి ఎక్స్ఛేంజీ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లోకి జులైలో రూ.1759 కోట్లు, ఆగస్టులో రూ.1904 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. గత ఆర్థిక సంవత్సరం వీటిల్లోకి నెలవారీ సగటు రూ.670 కోట్లతో పోలిస్తే ఇది అధికం. మనదేశం ప్రధానంగా యూఏఈ, బ్రిటన్, చైనాల నుంచి వెండిని దిగుమతి చేసుకుంటోంది.

**ఏడాదిలో రూ.1.5 లక్షలకు కిలో వెండి ధర!?**

ఈనాడు, హైదరాబాద్: కిలో రూ.1.32 లక్షలకు చేరిన వెండి ధర.. వచ్చే ఏడాది కాలంలో రూ.1.5 లక్షలకు పెరిగే అవకాశం ఉందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తాజా నివేదికలో పేర్కొంది. పెట్టుబడుల డిమాండ్‌కు తోడు, ఆభరణాల తయారీ రంగం, వాహన, పారిశ్రామిక రంగాలు వెండిని అధికంగా వినియోగిస్తున్నందునే ఈ లోహం ధర పైపైకి వెళ్లడమే కానీ, కిందకు దిగివచ్చే సంకేతాలు రావట్లేదు. అందువల్లే ధర ఇంకా పెరిగి రూ.1.5 లక్షలకు చేరుతుందని ఈ నివేదిక పేర్కొంది. డాలర్‌తో రూపాయి మారకపు విలువ రూ.88.5 అవుతుందని పరిగణించి, ఈ లెక్క కట్టింది. అంతర్జాతీయ మార్కెట్లో కోమెక్స్ వెండి ఫ్యూచర్స్ ధర ఔన్సు (31.10 గ్రాములు) 50 డాలర్ల ధర పలకవచ్చని వివరించింది. ప్రస్తుతం 42.5 డాలర్ల వద్ద ఉంది. 2025లో ఉత్పత్తి అయ్యే వెండిలో 60% పారిశ్రామిక డిమాండ్‌కు సరిపోతుందని అంచనా. ప్రధానంగా సౌర విద్యుత్తు, విద్యుత్తు వాహనాలు, 5జీ విభాగాల నుంచి వెండికి డిమాండ్ పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది.



# యెస్ బ్యాంక్‌లో 13.18%వాటా విక్రయించిన ఎస్‌బీఐ

దిల్లీ: యెస్ బ్యాంక్‌లో 13.18% వాటాను జపాన్ సంస్థ సుమిటోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ)కు విక్రయించడాన్ని పూర్తిచేసినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బుధవారం ప్రకటించింది. ఈ లావాదేవీ విలువ రూ.8,888.97 కోట్లు. సుమిటోమో మిత్సుయ్ ఫైనాన్షియల్ గ్రూప్ (ఎస్ఎంఎఫ్‌జీ)కు చెందిన ఆర్థిక సేవల విభాగమైన ఎస్ఎంబీసీ నుంచి ఈ మొత్తాన్ని అందుకున్నట్లు ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారంలో ఎస్‌బీఐ పేర్కొంది. యెస్‌బ్యాంకులో రూ.688 కోట్ల విలువైన వాటాలను ఎస్ఎంబీసీకి ఫెడరల్ బ్యాంక్, బంధన్ బ్యాంక్ విక్రయించాయి.

యెస్ బ్యాంక్‌లో 15.39 కోట్ల షేర్లను ఎస్ఎంబీసీకి రూ.331 కోట్లకు బంధన్ బ్యాంక్ విక్రయించింది. దీంతో యెస్ బ్యాంక్‌లో బంధన్ బ్యాంక్ వాటా 0.7% నుంచి 0.21 శాతానికి తగ్గింది.

ఒక్కో షేరు రూ.21.50 చొప్పున 16.62 కోట్ల యెస్ బ్యాంక్ షేర్లను రూ.357 కోట్లకు ఫెడరల్ బ్యాంక్ విక్రయించింది.

**రూ.176 లక్షల కోట్ల ఆస్తులు:** భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అగ్రగామి విదేశీ బ్యాంకుల్లో ఎస్ఎంఎఫ్‌జీ ఒకటి. జపాన్‌లో ఇది రెండో అతిపెద్ద బ్యాంకింగ్ గ్రూప్‌గా ఉంది. ఈ సంస్థ చేతిలో అంతర్జాతీయంగా 2 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.176 లక్షల కోట్ల) ఆస్తులు ఉన్నాయి. ఇప్పుడీ బ్యాంక్ చేతికి యెస్‌బ్యాంకులో 14% వరకు లభించింది.

2020లో పునర్వ్యవస్థీకరణ తర్వాత యెస్ బ్యాంక్‌లో అతిపెద్ద వాటాదారుగా ఎస్‌బీఐ మారింది. అనంతరం 2020 జులైలో యెస్ బ్యాంక్ ఫాలో ఆన్ పబ్లిక్ ఆఫర్‌లో భాగంగా అదనపు షేర్లను ఎస్‌బీఐ కొనుగోలు చేసింది. తాజా వాటా విక్రయం తర్వాత కూడా యెస్ బ్యాంక్‌లో 10.8% వాటాను ఎస్‌బీఐ కలిగి ఉంది. భారత బ్యాంకింగ్ రంగంలో ఇదే అతిపెద్ద సీమాంతర పెట్టుబడి కావడం విశేషం. ఈ లావాదేవీకి రిజర్వ్ బ్యాంక్, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా సహా అన్ని నియంత్రణ సంస్థల అనుమతులు లభించాయి.

**యెస్‌బ్యాంక్ మరింత పురోగతి సాధించాలి:** '2020లో ఆర్‌బీఐ చేపట్టిన యెస్ బ్యాంక్ పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక చాలా వినూత్నమైనది. మన దేశంలో మొదటిసారిగా ప్రభుత్వ రంగ ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. యెస్ బ్యాంక్‌తో ఈ ప్రయాణం చాలా విలువైనది. బ్యాంక్‌లో మార్పులకు తోడ్పాటు ఇవ్వడం గర్వకారణంగా ఉంది. ప్రభుత్వం, ఆర్‌బీఐ మార్గదర్శకత్వంలో ఎస్‌బీఐ, ఇతర బ్యాంకులు వినియోగదారుల హక్కులను కాపాడాయి. యెస్ బ్యాంక్‌లో వ్యూహాత్మక భాగస్వామిగా అడుగుపెడుతున్న ఎస్ఎంబీసీకి స్వాగతం. వారి అంతర్జాతీయ నైపుణ్యాలతో యెస్ బ్యాంక్ మరింత పురోగతి సాధించాలి' అని ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు.

ఈ వార్తల నేపథ్యంలో బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు 3.02%, ఫెడరల్‌బ్యాంక్ షేరు 1.30%, బంధన్ బ్యాంక్ షేరు 1.08% రాణించాయి.







# పేటీఎంలో UPI క్రెడిట్ లైన్ సదుపాయం.. ఎలా వాడాలంటే?

ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ పేటీఎం యూపీఐ క్రెడిట్ లైన్ సదుయాన్ని తీసుకొచ్చింది. 'పేటీఎం పోస్ట్‌పెయిడ్' పేరిట దీన్ని లాంచ్ చేసింది. సూర్యోదయ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంక్‌తో కలిసి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ సదుపాయం ద్వారా యూపీఐ చెల్లింపులు చేసి వచ్చే నెల ఒకేసారి బిల్లు చెల్లించుకునే అవకాశాన్ని కల్పిస్తోంది.

యూపీఐ వేదికగా స్వల్పకాలిక అవసరాలకు తీసుకునే డిజిటల్ రుణాలను క్రెడిట్ లైన్‌గా వ్యవహరిస్తారు. ఈ రుణం ద్వారా యూపీఐ యూజర్లు మర్చంటర్లకు స్కాన్ చేసి పేమెంట్లు చేయొచ్చు. వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో నగదు నిల్వలతో సంబంధం లేకుండా మీకు అందుబాటులో ఉన్న ప్రీ అప్రూవ్డ్ క్రెడిట్‌లైన్ నుంచి డెబిట్ అవుతుంది. బిల్లింగ్ సైకిల్ ఆధారంగా తిరిగి చెల్లింపులు చేయొచ్చు. ఇప్పటికే ఉన్న బ్యాంక్ వినియోగదారులతో పాటు కొత్త వినియోగదారులకూ ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు పేటీఎం ఓ ప్రకటనలో తెలిపింది.

ముగిసిన ఐటీఆర్ గడువు.. బిలేటెడ్ రిటర్న్స్ ఎలా ఫైల్ చేయాలంటే?

**ఎలా వాడాలి? ప్రయోజనమేంటి?**

పేటీఎం యాప్ ఓపెన్ చేసి మర్చంట్ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి క్రెడిట్‌లైన్ ఎంపిక చేసుకుని చెల్లింపులు చేయొచ్చు.

యూపీఐ మాదిరిగానే పిన్ ఎంటర్ చేసి లావాదేవీలను పూర్తి చేయొచ్చు.

క్యూఆర్ కోడ్, ఆన్‌లైన్ కొనుగోళ్లు, యుటిలిటీ బిల్లు చెల్లింపులకు ఈ క్రెడిట్‌లైన్‌ను వినియోగించుకోవచ్చు.

వ్యక్తుల నుంచి వ్యక్తులకు చెల్లింపులు చేసే వెసులుబాటు లేదు.బ్యాంకులో నగదులేని సందర్భాల్లో యూపీఐ క్రెడిట్‌లైన్ ఉపయోగపడుతుంది.


నెలకు రూ.60 వేలు వరకు కొనుగోళ్లు చేయొచ్చు. 30 రోజుల వరకు వడ్డీలేని కాలాన్ని వినియోగించుకుని తిరిగి చెల్లింపులు చేయొచ్చు.

ప్రతి నెలా ఒకటో తేదీని బిల్లింగ్ అవుతుందని పేటీఎం పేర్కొంది.

ఒకసారి పేటీఎం పోస్ట్‌పెయిడ్ యాక్టివేట్ చేసుకున్నాక తక్షణమే చెల్లింపులకు అవకాశం లభిస్తుంది.


మీరు వినియోగించుకున్న మొత్తానికి స్వల్ప మొత్తంలో ఫీజు చెల్లిస్తే సరిపోతుందని పేటీఎం పేర్కొంది.

# నేనూ తొలి రోజుల్లో అంతే



సినీ ప్రయాణంలో రోజులు గడుస్తున్న కొద్దీ.. తన పాత్రల ఎంపికలో మార్పు స్పష్టంగా తెలుస్తోందని అంటోంది కథానాయిక మాళవిక మోహనన్. ఇటీవలే 'హృదయపూర్వం'తో ప్రేక్షకుల్ని పలకరించిందీ తార. త్వరలో ప్రభాస్‌తో 'రాజాసాబ్', కార్తీతో కలిసి 'సర్దార్ 2' చిత్రాలతో తెరపైకి రాబోతుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక బలమైన స్త్రీ పాత్రలను పోషించాలనుకుంటున్నట్లు తన మనసులో మాటని బయటపెట్టింది. "చిత్రపరిశ్రమలోకి వచ్చిన మొదట్లో ఎవరైనా స్టార్ హీరోలు, దర్శకులతో పనిచేస్తూ కెరీర్‌లో తొందరగా పైకి రావాలనుకుంటారు. కానీ కాలక్రమేణ ఈ విషయంలో మార్పులు వస్తుంటాయి. నేనూ తొలి రోజుల్లో అంతే. కానీ ఇప్పుడు ప్రేక్షకుల హృదయాల్లో పాత్రలతోనే గుర్తుండిపోయే కథానాయికగా ఉండాలనుకుంటున్నా. మంచి అవకాశం వచ్చిందని పెద్ద చిత్రంలో భాగం కావచ్చు. కానీ అది గొప్ప పాత్ర కాకపోతే సినీప్రియుల్ని ఆకట్టుకోలేం. అందుకే అవకాశాలు అందుకోవడంలో ఆలస్యమైనా శక్తిమంతమైన కథలతో మీకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకోవాలి. బాలీవుడ్‌లో కూడా ఉత్తేజకరమైన ప్రాజెక్టుల్లో పనిచేయాలనుకుంటున్నా" అని చెప్పుకొచ్చింది మాళవిక.

# 'ఓజీ' బెనిఫిట్ షోకి ఏపీ ప్రభుత్వ అనుమతి.. టికెట్ ధర ఎంతంటే?



పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'ఓజీ' సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతోంది. ఈ మూవీ ఈ నెల 25న రిలీజ్ కానుంది. చిత్ర బృందం విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బెనిఫిట్ షోకి, కొన్ని రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చింది. సంబంధిత జీవో బుధవారం విడుదలైంది. ఈ నెల 25న రాత్రి 1గంటకు ప్రదర్శించే బెనిఫిట్ షో టికెట్ ధర రూ.1000 (జీఎస్టీతో కలిపి)కు విక్రయించేందుకు అనుమతించింది. అలాగే, చిత్రం విడుదల రోజు నుంచి అక్టోబరు 4 వరకు సింగిల్ స్క్రీన్స్‌లో రూ.125 (జీఎస్టీతో కలిపి), మల్టీప్లెక్స్‌ల్లో రూ.150 (జీఎస్టీ సహా) మేరకు అదనంగా పెంచుకొనేందుకు వీలు కల్పించింది.

ఓటీటీలోకి రొమాంటిక్ కామెడీ మూవీ.. 'సుందరకాండ' స్ట్రీమింగ్ ఎప్పుడంటే?

టికెట్ ధరల పెంపుపై నిర్మాణ సంస్థ డీవీవీ ఎంటర్‌టైనర్స్ సోషల్ మీడియా వేదికగా ఏపీ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపింది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్‌కు థాంక్స్ చెప్పింది. దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన చిత్రమిది. ఇందులో పవన్ ఓజాస్ గంభీరగా కనిపించనున్నారు. ఆయన సరసన ప్రియాంక మోహన్ నటించారు. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలన్ పాత్రలో ఓమీగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కానున్నారు. సంగీత దర్శకుడు తమన్ ఈ సినిమా నేపథ్యం సంగీతంలో కొత్త ఒరవడి సృష్టించనున్నారు. జపాన్ వాయిద్య పరికరం కోటోను ఉపయోగించి కొన్ని సన్నివేశాలకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ క్రియేట్ చేశారు. లండన్‌లోని ప్రఖ్యాత స్టూడియోలో 117 మంది సంగీత కళాకారులతో వర్క్ చేశారు.

# అమ్మ పాట మళ్లీ వస్తోంది



ధనుష్ హీరోగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇడ్లీ కడై'. నిత్యామేనన్ కథానాయిక. సత్యరాజ్, అరుణ్ విజయ్, రాజ్ కిరణ్, షాలినీ పాండే తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ సినిమా అక్టోబరు 1న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా చిత్రబృందం ప్రచారంలో భాగంగా ఈ సినిమా నుంచి ఓ గీతాన్ని విడుదల చేసింది. ఈ పాట "మా అమ్మ నన్ను నిద్ర పుచ్చడానికి పాడిన పాట మళ్లీ వస్తోంది. రాత్రికి దారిచూపేందుకు చంద్రుడు తిరిగి వస్తాడు.. గౌరి చెప్పిన శకునం వస్తుంది. ఆకాశం, భూమి అన్నీ ఓదార్పుగా వస్తాయి" అంటూ భావోద్వేగ పరంగా ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంది. ఈ పాటకు ధనుష్ సాహిత్యమందించగా..స్వరకర్త ఆంటోనీ దాసన్ ఆలపించారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ స్వరాలు సమకూరుస్తున్నారు.

# మోదీ జీవిత కథతో.. మా వందే



భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 75వ పుట్టినరోజును చేసుకొన్నారు. అగ్ర కథానాయకులు రజనీకాంత్, చిరంజీవి, మహేశ్‌బాబు, దర్శకులు ఎస్.ఎస్.రాజమౌళితోపాటు పలువురు సినీ ప్రముఖులు సామాజిక మాధ్యమాల వేదికగా నరేంద్ర మోదీకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. మీ నాయకత్వం స్ఫూర్తిదాయకం అంటూ కొనియాడారు. ఈ సందర్భంగానే నరేంద్ర మోదీ జీవిత కథతో 'మా వందే' అనే చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు ప్రకటించింది సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ సంస్థ. మోదీ పాత్రను మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ పోషించనున్నారు. క్రాంతికుమార్ సీహెచ్ దర్శకుడు. వీర్‌రెడ్డి.ఎం నిర్మాత. ఎన్నో పోరాటాలకన్నా తల్లి సంకల్ప బలం గొప్పదనే సందేశంతో, యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు తెలిపాయి సినీ వర్గాలు. చిత్ర నిర్మాత మాట్లాడుతూ "మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని సంఘటనలు, విశేషాల్ని ఎంతో సహజంగా సినిమాలో చూపించబోతున్నాం. అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సాంకేతిక విలువలతో పలు భారతీయ భాషలతో పాటు, ఆంగ్లంలోనూ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ప్రపంచ నాయకుడిగా మోదీ ఎదుగుదల వెనక ఆయన మాతృమూర్తి హీరాబెన్ ఇచ్చిన ప్రేరణ, తల్లితో మోదీకి ఉన్న అనుబంధం ప్రేక్షకులకు భావోద్వేగాల్ని పంచనుంది. సందేశంతోపాటు, మచ్చలేని నాయకుడిగా దేశసేవకే అంకితమైన ప్రధాని మోదీ జీవిత విశేషాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయి" అన్నారు. యుద్ధాలకి అతీతంగా ఎదిగి, విప్లవంగా మారిన ఓ వ్యక్తి కథ అంటూ కథానాయకుడు ఉన్ని ముకుందన్ చిత్ర విశేషాల్ని పంచుకున్నారు. ఈ సినిమాకి ఛాయాగ్రహణం:కె.కె.సెంథిల్‌కుమార్, సంగీతం: రవి బస్రూర్, కూర్పు: శ్రీకర్ ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్: సాబుసిరిల్.

నమో నమో ఆర్త బాంధవుడా

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ పుట్టిన రోజు వేళ ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం కీరవాణి.. మోదీపై ఓ ప్రత్యేక గీతాన్ని రూపొందించారు. ఈ పాటను నిర్మాణ సంస్థ టీసిరీస్ 'మోదీజీ75' పేరుతో బుధవారం సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది. 'మేరు నగం లాంటి మేటి నేతా.. నిన్ను చూసి మురిసె దేశ మాతా. ధర్మయోగి నీవే.. కర్మయోగి నీవే.. నమో నమో నమో ఆర్త బాంధవుడా! నీకు సాటి నీవెగా నరేంద్రుడా" అంటూ సాగుతున్న ఈ పాటలో మోదీ హయాంలో దేశ అభివృద్ధికి సంబంధించిన పలు విజువల్స్‌తో వీడియోను రూపొందించారు. దీనికి కీరవాణి స్వరాలు సమకూర్చడంతో పాటు షగున్ సోధి, ఐరా ఉడుపితో స్వయంగా ఆలపించడం విశేషం. నదాన్ సాహిత్యం అందించారు.

# నా జీవిత ప్రయాణం కష్టాలమయం కాబట్టే..!

'భద్రకాళి' మీ కెరీర్‌లో ఓ మైలురాయిలాంటి 25వ సినిమా కదా. కథ విషయంలో ప్రత్యేకమైన జాగ్రత్తలేమైనా తీసుకున్నారా?

23, 24, 25 ఇలా సంఖ్య మారొచ్చేమో కానీ, ప్రతి సినిమా నాకు ముఖ్యమే. నేను చేసే ప్రతి సినిమాకీ కథ పరంగా ప్రత్యేకమైన జాగ్రత్తలే తీసుకుంటా. అయితే 'భద్రకాళి' ప్రత్యేకత ఏంటంటే నా కెరీర్‌లోనే అత్యధిక వ్యయంతో రూపొందిన సినిమా.


ఈ కథలో మిమ్మల్ని ఆకర్షించిన విషయాలేమిటి?

పొలిటికల్ థ్రిల్లర్ సినిమాల్లో ఇదొక కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తుంది. ఇందులో నేనొక రాజకీయ మధ్యవర్తిగా కనిపిస్తా. ఇలాంటి పాత్రతో ఇప్పటివరకూ ఏ సినిమా రాలేదు. ఈ సినిమా ప్రయాణంలో మీకెదురైన సవాళ్లు ఎలాంటివి?ఇప్పటివరకూ సాగిన నా జీవిత ప్రయాణంలో లెక్కలేనన్ని కష్టాల్ని ఎదుర్కొన్నాను. అందుకే ఎలాంటి సవాళ్లు ఎదురైనా అవి కష్టాలు అనిపించవు. ఈ సినిమాకి నిర్మాతని నేనే. నా వెనకాల ఎవ్వరూ లేరు. ప్రతి పైసాని స్వయంగా తీసుకొచ్చి ఖర్చు పెట్టాల్సిందే. 15 నెలలపాటు ఈ సినిమా ప్రయాణం సాగింది. నిర్మాణ వ్యయం, వడ్డీలు, విడుదలకి సంబంధించి వ్యాపార లావాదేవీలు... ఇలా కచ్చితంగా కొన్ని ఒత్తిళ్లు ఎదురవుతాయి. కానీ వాటన్నిటినీ అధిగమించేంత శక్తి సినిమానే ఇస్తుంది. నిర్మాత సురేశ్‌బాబుతో నాకు మంచి అనుబంధం ఉంది. నా గత చిత్రం 'మార్గన్'ని ఆయనే విడుదల చేశారు. తెలుగు చిత్రాన్ని విడుదల చేస్తున్న నిర్మాత జవ్వాజి రామాంజనేయులు, నేను మరోసారి సురేశ్‌బాబు, రానా దగ్గుబాటితో కలిసి ప్రయాణం చేస్తున్నాం. వాళ్లు ఈ సినిమాని 300కిపైగా థియేటర్లలో విడుదల చేస్తున్నారు.25 సినిమాల ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే ఏమనిపిస్తోంది?

నాలో ప్రతిభ ఉందో లేదో నాకు తెలియదు కానీ, నేను హార్డ్‌వర్కర్ అని చెప్పుకోవడానికి మాత్రం వెనకాడను. సినిమా కోసం రాత్రిపగలు అనే తేడా లేకుండా కష్టపడతాను. అదే నన్ను ఇక్కడివరకూ తీసుకొచ్చింది. తెలుగు ప్రేక్షకులు గొప్పగా ఆదరించారు, ప్రేమాభిమానాల్ని పంచారు. భవిష్యత్తులో కూడా ఇంతే నిజాయతీతో సినిమాలు చేస్తా.ఈమధ్య తెలుగులో మీ సినిమాలు తమిళ పేర్లతోనే విడుదల అవుతుండడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 'బిచ్చగాడు' తరహాలో తెలుగు పేర్లతో సినిమాలు విడుదల చేయకపోవడానికి కారణం ఏమిటి? ఓటీటీ వేదికలు సినిమాకి అన్ని భాషల్లో ఒకే పేరు ఉండేలా చూడాలని కోరుతున్నాయి. అందుకే అలా జరుగుతోంది. అంతే తప్ప వేరే ఉద్దేశం లేదు. చాలా సినిమాలు అలా ఒకే పేరుతోనే విడుదలవుతున్నాయి. అయితే ఒక భాషలో పేరు, మరొక భాషలో తప్పుడు అర్థం వచ్చేలా ఉందనిపిస్తే వెంటనే మార్చేస్తాం. 'బూకీ' అనే సినిమా పేరుని అలాగే మార్చాం.



# తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ పేరిట అక్రమాలు



తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు డి.సాయిలు సంచలన వ్యాఖ్యలు చేశారు. కొందరు సంబంధం లేని వ్యక్తులు నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో తమ సంఘాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. కోదాడకు చెందిన శ్రుతి అనే మహిళ తమ సంఘం పేరిట అక్రమాలకు పాల్పడుతోందని అన్నారు.

తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ సంఘంతో సంబంధమే లేని ఆమె.. నకిలీ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి అక్రమంగా పోటీలను నిర్వహిస్తుందని తెలిపారు. గతంలో వేసిన అడ్‌హక్ కమిటీకి చైర్మన్‌గా ఉన్న సుబ్రమణ్యం, వెంకటరమణ, హన్మంత్‌రాజ్‌తో కలిసి నిధుల దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు.

సభ్యత్వమే లేని సంఘాలకు ఓటు హక్కు కల్పించి, సభ్యత్వం ఉన్న సంఘాల గుర్తింపు రద్దు చేశారని అన్నారు. నకిలీ సంఘాలతో ఎన్నికలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. శ్రుతి నడుపుతున్న సంఘంలో పోలీసు, ఐటీ, పోస్టల్ డిపార్ట్‌మెంట్లకు చెందిన ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. వీరిలో సగం మందికి వారు సభ్యులుగా ఉన్న విషయమే తెలీదని అన్నారు.

జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సంఘంలోని ఓ పెద్ద మనిషి, శాట్‌లోని ఓ డిప్యూటీ డైరెక్టర్, తెలంగాణ ఒలింపిక్ సంఘం మాజీ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ అండదండలతో శ్రుతి పేట్రేగిపోతుందని ఆరోపించారు. ఈ విషయాన్ని క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ సంఘం పేరిట శ్రుతి చేస్తున్న అక్రమాలపై విజిలెన్స్ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు.

# మంధన విధ్వంసకర శతకం..

## ఆసీస్‌ను చిత్తుగా ఓడించిన టీమిండియా



మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా మహిళల జట్టుతో ఇవాళ (సెప్టెంబర్ 17) జరిగిన రెండో వన్డేలో టీమిండియా 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. 49.5 ఓవర్లలో 292 పరుగులు చేసి ఆలౌటైంది.

ఓపెనర్ స్మృతి మంధన (91 బంతుల్లో 117; 14 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర శతకంతో విరుచుకుపడింది. భారత ఇన్నింగ్స్‌లో మంధన మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. దీప్తి శర్మ (40), రిచా ఘోష్ (29), ప్రతిక రావల్ (25), స్నేహ్ రాణా (24) పర్వాలేదనిపించారు.

హర్లీన్ డియోల్ (10), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (17), రాధా యాదవ్ (6), అరుంధతి రెడ్డి (4), క్రాంతి గౌడ్ (2) స్వల్ప స్కోర్లకే ఔటై నిరాశపరిచారు. ఆసీస్ బౌలర్లలో డార్సీ బ్రౌన్ 3, ఆష్లే గార్డ్‌నర్ 2, మెగాన్ షట్, అన్నాబెల్ సదర్లాండ్, తహ్లియా మెక్‌గ్రాత్ తలో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ఆసీస్ కెప్టెన్ హీలీ ఏకంగా ఎనిమిది బౌలర్లను ప్రయోగించింది.

అనంతరం 293 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన ఆసీస్ ఏ దశలోనూ గెలుపు దిశగా సాగలేదు. క్రాంతి గౌడ్ (9.5-1-28-3), దీప్తి శర్మ (6-0-24-2), రేణుకా సింగ్ ఠాకూర్ (6.3-0-28-1), స్నేహ్ రాణా (6-0-35-1), అరుంధతి రెడ్డి (7.3-0-46-1), రాధా యాదవ్ (5-0-27-1) ధాటికి 40.5 ఓవర్లలో 190 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో సదర్లాండ్ (45), ఎల్లిస్ పెర్రీ (44) మాత్రమే ఓ మోస్తరు స్కోర్లు చేశారు.

ఈ గెలుపుతో భారత్ సిరీస్‌లో 1-1తో సమంగా నిలిచింది. నిర్ణయాత్మక మూడో వన్డే న్యూఢిల్లీ వేదికగా సెప్టెంబర్ 20న జరుగనుంది.

# కాంస్య పతక రేసులో అంతిమ్



జాగ్రెబ్ (క్రొయేషియా): ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ అంతిమ్ పంఘాల్ (53కేజీ) కాంస్య పతకం కోసం పోటీపడనుంది. సెమీఫైనల్లో ఆమె 3-5తో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత లూసియా యెపెజ్ గుజ్‌మన్ (ఈక్వెడార్) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు క్వార్టర్‌ఫైనల్లో అంతిమ్ 9-8తో చైనా అమ్మాయి జిన్ జాంగ్‌పై విజయం సాధించింది. మరో క్వార్టర్‌ఫైనల్లో మనీషా భన్వాలా 0-8తో ఓక్ జు కిమ్ (ఉత్తర కొరియా) చేతిలో ఓడిపోయింది. ఆ తర్వాత కిమ్ ఫైనల్ చేరడంతో మనీషాకు రెపిచేజ్ రౌండ్లో ఆడే అవకాశం లభించింది. రాధిక (68కేజీ), జ్యోతి (72కేజీ) తొలి రౌండ్లో పరాజయంపాలయ్యారు.

# టైటాన్స్ హ్యాట్రిక్ ఓటమి



జైపుర్: ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌ను పేలవంగా ఆరంభించాక, కాస్త పుంజుకున్నట్లే కనిపించిన తెలుగు టైటాన్స్.. మళ్లీ తడబడుతోంది. ఆ జట్టు వరుసగా మూడో ఓటమిని ఖాతాలో వేసుకుంది. బుధవారం టైటాన్స్ 29-33తో దబంగ్ దిల్లీ చేతిలో పరాజయం పాలైంది. విరామ సమయానికి 14-9తో దిల్లీ స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధంలో టైటాన్స్ పుంజుకుని 19-21తో దిల్లీ ఆధిక్యాన్ని తగ్గించింది. 27-28, 28-30 చివర్లోనూ ప్రత్యర్థిని అందుకోవడానికి గట్టిగా ప్రయత్నించింది. కానీ ఒత్తిడిలో నిలిచిన దిల్లీ.. మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. 8 మ్యాచ్‌ల్లో టైటాన్స్‌కిది అయిదో ఓటమి. దిల్లీ ఆటగాడు నీరజ్ నర్వాల్ 9 పాయింట్లతో మ్యాచ్‌లో టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్ 43-32 పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. శివమ్ పటారే 15 పాయింట్లతో హరియాణాను గెలిపించాడు.

# యూఏఈతో మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయనున్న పాకిస్తాన్..?



ఆసియా కప్2025లో భాగంగా భారత్, పాకిస్తాన్ క్రికెటర్ల మధ్య చోటు చేసుకున్న 'హ్యాండ్‌షేక్ వివాదం' తీవ్రరూపం దాల్చినట్లు కనిపిస్తుంది. పాక్ క్రికెట్ టీమ్ ఇవాళ (సెప్టెంబర్ 17) యూఏఈతో జరుగబోయే మ్యాచ్ సహా ఆసియా కప్ మొత్తాన్ని బాయ్‌కాట్ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది.

యూఏఈతో మ్యాచ్ ప్రారంభానికి గంట సమయం మాత్రమే ఉన్నా, పాక్ క్రికెటర్లు ఇంకా హోటల్ రూమ్‌ల నుంచి బయటికి రాలేదని సమాచారం. హ్యాండ్‌షేక్ వివాదంపై పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహిసిన్ నఖ్వీ కాసేపట్లో పాక్ నుంచి మీడియా సమావేశం నిర్వహిస్తాడని తెలుస్తుంది.

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సెప్టెంబర్ 14న జరిగిన మ్యాచ్ సందర్భంగా భారత క్రికెటర్లు పాక్ ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వడానికి నిరాకరించారు. దీన్ని అవమానంగా భావించిన పాక్.. భారత ఆటగాళ్లపై చర్యలు తీసుకోవాలని ఐసీసీకి ఫిర్యాదు చేసింది.

అలాగే ఆ మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహరించిన ఆండీ పైక్రాఫ్ట్‌ను ఆసియా కప్ నుంచి తప్పించాలని డిమాండ్ చేసింది. పైక్రాఫ్ట్ షేక్‌హ్యాండ్ ఇవ్వొద్దని తమ కెప్టెన్ సల్మాన్ అఘాకు చెప్పాడని, ఈ వివాదానికి అతనే బాధ్యుడని పీసీబీ గగ్గోలు పెడుతుంది.

పీసీబీ డిమాండ్లను పరిశీలించిన ఐసీసీ.. షేక్ హ్యాండ్ ఇవ్వడమనేది ఆటగాళ్ల వ్యక్తిగత విషయమని కొట్టిపారేసింది. అలాగే షేక్‌హ్యాండ్ ఉదంతంలో పైక్రాఫ్ట్ పాత్ర ఏమీ లేదని యూఏఈతో మ్యాచ్‌కు అతన్నే రిఫరీగా కొనసాగించేందుకు నిర్ణయించుకుంది.

ఐసీసీ నిర్ణయాలతో ఖంగుతిన్న పీసీబీ చేసేదేమీ లేక ఆసియా కప్‌ను బహిష్కరించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తుంది.

ఇదిలా ఉంటే, ఆసియా కప్‌లో ముందు దశకు (సూపర్4) వెళ్లాలంటే పాక్ యూఏఈపై తప్పక గెలవాల్సిన పరిస్థితి ఉంది. గ్రూప్‌ఏలో పాక్ పసికూన ఒమన్‌పై విజయం సాధించి, టీమిండియా చేతిలో చిత్తుగా ఓడింది. మరోవైపు యూఏఈ టీమిండియా చేతిలో ఓడి, ఒమన్‌పై విజయం సాధించింది.

ప్రస్తుతం పాక్, యూఏఈ ఆడిన రెండు మ్యాచ్‌ల్లో చెరో విజయంతో పాయింట్ల పట్టికలో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఒకవేళ పాక్ యూఏఈతో మ్యాచ్‌ను బహిష్కరిస్తే టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. ఇదే జరిగితే యూఏఈ భారత్‌తో పాటు సూపర్4కు చేరుకుంటుంది.

# మరోసారి బీభత్సం సృష్టించిన సాల్ట్.. ఈసారి పసికూన బలి

అంతర్జాతీయ టీ20ల్లో ఇంగ్లండ్ ఓపెనర్ ఫిల్ సాల్ట్ విధ్వంసకాండ కొనసాగుతోంది. కొద్ది రోజుల కిందట సౌతాఫ్రికాపై సుడిగాలి శతకంతో (60 బంతుల్లో 141 నాటౌట్; 15 ఫోర్లు, 8 సిక్సర్లు) విరుచుకుపడిన అతను.. ఇవాళ (సెప్టెంబర్ 17) పసికూన ఐర్లాండ్‌పై అదే తరహాలో రెచ్చిపోయాడు.

మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా జరిగిన తొలి మ్యాచ్‌లో సాల్ట్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఐర్లాండ్ నిర్దేశించిన 197 పరుగుల లక్ష్య ఛేదనలో ఆది నుంచే బ్యాట్ ఝులిపిస్తూ విధ్వంసం సృష్టించాడు. 46 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 89 పరుగులు చేసి గెలుపు ఖరారయ్యాక ఔటయ్యాడు.

సాల్ట్ వీర ఉతుకుడు ధాటికి ఇంగ్లండ్ మరో 14 బంతులు మిగిలుండగానే (6 వికెట్లు కోల్పోయి) లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ అంచనాలకు మించి భారీ స్కోర్ చేసింది. హ్యారీ టెక్టార్ (36 బంతుల్లో 61 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), లోర్కన్ టక్కర్ (36 బంతుల్లో 55; 3 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపు అర్ద శతకాలతో చెలరేగిపోయారు. ఓపెనర్లు పాల్ స్టిర్లింగ్ (34), రాస్ అదైర్ (26) కూడా సత్తా చాటారు.

ఐరిష్ బ్యాటర్ల ధాటికి ఇంగ్లండ్ బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు. ఓవర్టన్, డాసన్, ఆదిల్ రషీద్ మాత్రం తలో వికెట్ తీశారు.

197 పరుగుల లక్ష్య ఛేదనలో సాల్ట్ తొలి బంతి నుంచే డ్యూటీకి ఎక్కాడు. అతనికి బట్లర్ (10 బంతుల్లో 28), జేకబ్ బేతెల్ (16 బంతుల్లో 24), సామ్ కర్రన్ (15 బంతుల్లో 27) తోడయ్యారు. మ్యాచ్‌ను మరింత వేగంగా ముగించే క్రమంలో ఇంగ్లండ్ బ్యాటర్లు వికెట్లు కోల్పోయారు. రెహాన్ అహ్మద్ 8, టామ్ బాంటన్ 11 పరుగులకు ఔటయ్యారు. ఓవర్టన్ బౌండరీతో మ్యాచ్‌ను ముగించాడు.

ఐరిష్ బౌలర్లలో హంఫ్రేస్, హ్యూమ్ తలో 2, హ్యారీ టెక్టార్, గెరాత్ డెలానీ చెరో వికెట్ తీశారు. ఈ సిరీస్‌లోని రెండో టీ20 సెప్టెంబర్ 19న డబ్లిన్‌లోనే జరుగనుంది. ఈ సిరీస్ కోసం ఇంగ్లండ్ ఐర్లాండ్‌లో పర్యటిస్తుంది.

